## మల్లంపల్లి అంగడి స్థలం ఎక్కడ?




PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## కమలాపూర్ ప్రజావాణిలో 28 దరఖాస్తులు: ఎంపీడీవో గుండె బాబు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 275 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 29 సెప్టెంబర్ 2026




# విద్యుత్ బిల్లుతో ట్రాఫిక్ చలాన్లు లింక్ చేయాలా?

**- పెండింగ్ చలాన్ల వసూలుపై సుప్రీంకోర్టు కీలక సూచన**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్లను వసూలు చేసేందుకు విద్యుత్ బిల్లులతో అనుసంధానం చేసే అంశాన్ని సుప్రీంకోర్టు ప్రస్తావించింది. చలాన్లు చెల్లించకుండా ఉన్న వాహనదారుల నుంచి బకాయిలను వసూలు చేసేందుకు మిగతా2లో...

# అసెంబ్లీ కంటే.. జైలుకే ఎక్కువసార్లు వెళ్లా...

**ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్ అనేకసార్లు జైలుకు పంపారు: సీఎం రేవంత్‌రెడ్డి**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ అసెంబ్లీకి వెళ్లిన దానికంటే తాను ఎక్కువసార్లు జైలుకే వెళ్లానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తనను అనేకసార్లు జైలుకు పంపారని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహించిన 'ది కాన్‌క్లేవ్ 2026' కార్యక్రమంలో 'ఇండియాస్ నెక్ట్స్ చాప్టర్' అంశంపై సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజకీయాలు, విద్య, కేంద్రరాష్ట్ర సంబంధాలు, నియోజకవర్గాల పునర్విభజన, ఎన్నికల ప్రక్రియతో పాటు తన రాజకీయ ప్రస్థానంపై పలు అంశాలను వెల్లడించారు. **విద్యకు అత్యంత ప్రాధాన్యం** దేశ అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని రేవంత్‌రెడ్డి అన్నారు. మిగతా2లో...



# తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు కీలక స్పష్టత

**- స్థానిక రిజర్వేషన్లకు నాలుగేళ్ల విద్యాభ్యాసం తప్పనిసరి**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో స్థానికత, స్థానిక రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక స్పష్టత ఇచ్చింది. రాష్ట్రంలో స్థానిక రిజర్వేషన్ల ప్రయోజనం పొందాలంటే నిర్దేశిత మిగతా2లో...

## అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై చైనా సుంకాల తగ్గింపు

**- సోయాబీన్స్‌కు మాత్రం అదనంగా 10 శాతం సుంకం కొనసాగింపు**



**బీజింగ్,సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** అమెరికాచైనా వాణిజ్య చర్చల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే పలు వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు చైనా అంగీకరించింది. అయితే మిగతా2లో...




# ఖైరతాబాద్ ఉపఎన్నిక..

**- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల బలపరీక్ష...ముమ్మరమైన రాజకీయ పోరు!**

# ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డికి ఊరట

**- రూ.50 లక్షల అటాచ్‌మెంట్ ధ్రువీకరణ ఉత్తర్వులు రద్దు చేసిన అప్పిలేట్ ట్రైబ్యునల్**






# ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

**లారీ - ఆటో ఢీ.. మరో ఇద్దరి పరిస్థితి విషమం**

**మంచిర్యాల,సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నస్పూర్ మండల కేంద్రంలో కూలీలతో వెళ్తున్న ఆటో రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. మిగతా2లో...

# అభ్యర్థి ఎవరైనా.. గెలుపే ధ్యేయం

**ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేయించాలి: కేటీఆర్**

**ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉమ్మడి పాలమూరు బీఆర్ఎస్ నేతలతో సమావేశం**



**మహబూబ్‌నగర్,సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ రంగారెడ్డిమహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎవరైనా ఆయన విజయమే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు సూచించారు. ఎన్నికల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ అత్యంత కీలకమని, అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేయించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో కేటీఆర్ సమావేశమయ్యారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఓటర్ల నమోదు, పార్టీ శ్రేణుల సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. **ఓటర్ల నమోదుపై దృష్టి** ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటును నమోదు చేయించడం ముఖ్యమని కేటీఆర్ పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు, మిగతా2లో...



## సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి

**- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ ఆందోళన.. ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద ధర్నా**

**హైదరాబాద్,సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని తెలంగాణ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించారు. **సీఈసీపై ఆరోపణలు** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ విషయంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, మిగతా2లో...

# తొలిసారి కక్ష్యలోకి స్టార్‌షిప్

**స్పేస్‌ఎక్స్‌కు కీలక మైలురాయి.. 26 స్టార్‌లింక్ ఉపగ్రహాల ప్రయోగం**



**టెక్సాస్,సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన స్టార్‌షిప్ రాకెట్ తొలిసారిగా భూకక్ష్యలోకి విజయవంతంగా చేరింది. అమెరికాలోని టెక్సాస్‌లో ఉన్న స్టార్‌బేస్ నుంచి చేపట్టిన 14వ ప్రయోగంలో ఈ కీలక మిగతా2లో...

# నిరసనలకు అడ్డాగా సచివాలయం

**- కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు**



**హైదరాబాద్,సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరిపాలనకు కేంద్రంగా ఉండాల్సిన రాష్ట్ర సచివాలయం కాంగ్రెస్ పాలనలో నిరసనలకు వేదికగా మారడం సిగ్గుచేటని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులు, చిన్న కాంట్రాక్టర్లు తమ బకాయిల కోసం సచివాలయం వద్ద ఆందోళన చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ.. చిన్న కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులకు కమీషన్లు డిమాండ్ చేస్తున్నారంటూ గతంలో చేసిన ఆరోపణలను ఆయన మరోసారి ప్రస్తావించారు. కమీషన్లు ఇవ్వలేదనే కారణంతోనే బిల్లులు నిలిపివేస్తున్నారా మిగతా2లో...

# ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డికి ఊరట

**హైదరాబాద్,సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఓటుకు నోటు కేసులో ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన రూ.50 లక్షల అటాచ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అప్పిలేట్ ట్రైబ్యునల్ రద్దు చేసింది. ఈ ఉత్తర్వులతో రేవంత్‌రెడ్డితో పాటు మరో ముగ్గురికి ఈ అంశంలో ఉపశమనం లభించింది.న్యూఢిల్లీలోని స్మగ్లర్స్ అండ్ ఫారెన్ ఎక్స్ఛేంజ్ మ్యానిప్యులేటర్స్ పరిధిలోని అప్పిలేట్ ట్రైబ్యునల్ ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయమూర్తి మునీశ్వర్‌నాథ్ భండారీ నేతృత్వంలోని ధర్మాసనం రేవంత్‌రెడ్డి, వేమ్ కృష్ణ కీర్తన్, రుద్ర శివకుమార్ ఉదయ్‌సింహ, బిషప్ హ్యారీ సెబాస్టియన్ దాఖలు చేసిన అప్పీళ్లను విచారించింది. 2015 నాటి ఓటుకు నోటు వ్యవహారంలో రూ.50 లక్షల నగదును ఏసీబీ ఇప్పటికే స్వాధీనం చేసుకుని ట్రయల్ కోర్టులో భద్రపరిచిందని అప్పీలుదారుల తరఫు న్యాయవాదులు వాదించారు. దీంతో అదే మొత్తానికి సమానమైన మరో రూ.50 లక్షలను ఈడీ అటాచ్ చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.ఈ వాదనను పరిశీలించిన ట్రైబ్యునల్.. అసలు రూ.50 లక్షలు ఇప్పటికే కోర్టు ఆధీనంలో భద్రంగా ఉన్నందున వాటిని నిందితులు తరలించడం లేదా ఇతర విధంగా వినియోగించే అవకాశం లేదని పేర్కొంది. ఈ పరిస్థితుల్లో సమాన విలువ కలిగిన మరో మొత్తాన్ని అటాచ్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో 2022లో అటాచ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది.అయితే ఈ తాజా ఉత్తర్వులు మొత్తం ఓటుకు నోటు క్రిమినల్ కేసును కొట్టివేసినట్లు కాదని సంబంధిత నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రధానంగా ఈడీ చేసిన రూ.50 లక్షల అటాచ్‌మెంట్‌కు సంబంధించిన అంశంపైనే ట్రైబ్యునల్ నిర్ణయం వెలువరించింది.

# అసెంబ్లీ కంటే.. జైలుకే ఎక్కువసార్లు వెళ్లా...

(మొదటి పేజీ తరువాయి)

స్వాతంత్ర్యం అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్యకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. చదువుకోవడం వల్లే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించే స్థాయికి ఎదిగారని, మన్మోహన్‌సింగ్ ప్రధానిగా, అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా ఎదిగారని పేర్కొన్నారు. తెలంగాణలో నాణ్యమైన విద్య అందించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని సీఎం తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు, ఆ తర్వాత నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని, అందులో భాగంగానే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. **రాజకీయ ప్రస్థానంపై వ్యాఖ్యలు** తన రాజకీయ ప్రస్థానాన్ని కూడా రేవంత్‌రెడ్డి వివరించారు. 2006లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి జడ్పీటీసీగా గెలిచానని, 2007లో స్వతంత్ర ఎమ్మెల్సీగా విజయం సాధించానని తెలిపారు. అనంతరం ప్రతిపక్షంలో ఉండాలనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీలో చేరానని, ఆ పార్టీ తరఫున 2009, 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని చెప్పారు. 2017లో కాంగ్రెస్‌లో చేరి, 2019లో ఎంపీగా పోటీ చేసి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యం తగ్గిందని, ప్రజల సూచనతో కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నానని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాహుల్‌గాంధీని తొలిసారి కలిసిన సందర్భాన్ని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. **ఎక్కడ ఉన్నా ప్రజాసేవే లక్ష్యం**2014 తర్వాత తెలంగాణలో రాజకీయ పోటీ కేసీఆర్ వర్సెస్ రేవంత్‌గా మారిందని సీఎం పేర్కొన్నారు. ఆ సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీఏతో రాజకీయంగా పోరాడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. తన రాజకీయ ప్రయాణంలో రాహుల్‌గాంధీ, దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్ తనకు శ్రేయోభిలాషులుగా ఉన్నారని చెప్పారు.తాను విద్యార్థి సంఘంలో ఉన్నా, తెలుగుదేశం పార్టీలో ఉన్నా, కాంగ్రెస్‌లో ఉన్నా దేశం, రాష్ట్రం కోసం పనిచేయాలనే లక్ష్యంతోనే రాజకీయాల్లో కొనసాగుతున్నానని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# అభ్యర్థి ఎవరైనా.. గెలుపే ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

విద్యాసంస్థలు, ఉద్యోగ వర్గాల్లో అర్హత ఉన్న గ్రాడ్యుయేట్లను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని నాయకులకు సూచించారు. పార్టీ ఖరారు చేసే అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వంపై గ్రాడ్యుయేట్లు, విద్యావంతుల్లో వ్యతిరేకత ఉందని కేటీఆర్ సమావేశంలో పేర్కొన్నట్లు ఆంధ్రజ్యోతి తెలిపింది. అలాంటి ఓటర్లను పార్టీకి అనుకూలంగా మలచుకునేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. **పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలి** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎవరైనా ఆయన గెలుపు కోసం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని కేటీఆర్ కోరారు. ఎన్నికలకు ముందుగానే ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి సారించి, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌కు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాజీ మంత్రులు వి. శ్రీనివాస్‌గౌడ్, ఎస్. నిరంజన్‌రెడ్డి, సి. లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ నవీన్‌కు మార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్దన రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, రావుల చంద్రశేఖ ర్‌రెడ్డి, మాజీ ఐపీఎస్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొన్నారు. మాజీ శాట్స్ చైర్మన్ ఆంజనే యులుగౌడ్, గద్వాల జిల్లా నాయకుడు హనుమంత్‌నాయుడు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి

(మొదటి పేజీ తరువాయి)

వివేక్ జోషి లేవనెత్తినట్లు వచ్చిన అభ్యంతరాలపై ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6లో ప్రత్యేక సవరణకు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. ఓటర్ల సమాచారంలో మార్పులు చేసే విధానం, క్షేత్రస్థాయిలో పనిచేసే ఎన్నికల నమోదు అధికారుల బాధ్యతలు, పర్యవేక్షణపై వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కూడా జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘంలోని ఇతర కమిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. దీనివల్ల అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్షర దోషాలను సరిదిద్దకుండానే నోటీసులు జారీ చేయడంపై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు.**ఓటు హక్కును కాపాడాలి** నిరసనలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ఓటు హక్కును కాపాడటం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకమని అన్నారు. ది

ఓటర్ల జాబితా సవరణ పేరుతో పేర్లు తొలగిస్తున్నారన్న ఆందోళనలకు ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కూడా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై వచ్చిన అభ్యంతరాలపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని గతంలో కోరారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు నిర్వహించాలని కాంగ్రెస్ పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 28న తెలంగాణలోని జిల్లా కేంద్రాల్లోనూ ఆందోళనలు నిర్వహించినట్లు పార్టీ నేతలు తెలిపారు.మరోవైపు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం జ్ఞానేశ్‌కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి తమ పార్టీ లేవనెత్తుతున్న అంశాలపై సమగ్ర దర్యాప్తు జరగాలని కోరారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ నేతలు లేవనెత్తుతున్న ఆరోపణల నేపథ్యంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఫారం-6లో మార్పులు, ఓటర్ల పేర్ల తొలగింపు విధానం తదితర అంశాలపై ఎన్నికల సంఘం నుంచి స్పష్టమైన వివరణ రావాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ అంశంపై తమ ఆందోళనలను కొనసాగిస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు.

# ఖైరతాబాద్ ఉపఎన్నిక..

**హైదరాబాద్,సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమవుతోంది. దానం నాగేందర్ అనర్హత ఉదంతంతో ఖాళీ అయిన ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి త్వరలో జరగనున్న ఉపఎన్నిక కేవలం ఒక నియోజకవర్గానికి పరిమితమైనది కాదు. 2028 సాధారణ ఎన్నికలకు ముందస్తు సెమీఫైనల్‌గా, రాష్ట్రంలోని మూడు ప్రధాన రాజకీయ పార్టీల బలాబలాలను బేరీజు వేసే అసలు సిసలు పరీక్షగా ఇది రూపాంతరం చెందుతుంది. దానం నాగేందర్ అనర్హతతో ఖాళీ అయిన ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి త్వరలో జరగనున్న ఉపఎన్నిక రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. 2028 సాధారణ ఎన్నికలకు ఇది సెమీఫైనల్‌గా మారుతుండటంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఈ పోరును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి.అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకోవడంతో పాటు ఫిరాయింపుల రాజకీయాలపై ప్రజా తీర్పును కోరేందుకు సిద్ధమవుతోంది. దానం నాగేందర్ మళ్లీ టికెట్ ఆశిస్తున్నప్పటికీ, అభ్యర్థి ఎంపికపై పార్టీలో సస్పెన్స్ కొనసాగుతోంది. మరోవైపు, కోల్పోయిన




సీటును తిరిగి దక్కించుకోవడంతో పాటు గ్రేటర్ హైదరాబాద్‌లో తన పట్టును నిరూపించుకోవడానికి బీఆర్ఎస్‌కు ఇది కీలక అవకాశం. ఈ పార్టీ నుంచి తలసాని సాయికిరణ్ యాదవ్, దాసోజు శ్రవణ్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇక 2014లో విజయం సాధించిన బీజేపీ, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వచ్చిన ఆధిక్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ స్థానంలో మళ్లీ పాగా వేయాలని చూస్తోంది.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సార్) తర్వాత నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య సుమారు 1.86 లక్షలకు చేరింది. ముస్లిం, రెడ్డి, బీసీ ఓటర్లు ఇక్కడ గెలుపు ఓటములను నిర్ణయించడంలో కీలకం కానున్నారు. అనర్హత వేటు పడినప్పటికీ తాను ఏ పార్టీ నుంచైనా బరిలో దిగుతానని దానం నాగేందర్ సంకేతాలు ఇస్తుండటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. మరోవైపు ఎంఐఎం మద్దతు ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారగా, కల్వకుంట్ల కవిత పార్టీ (తెలంగాణ రక్షణ సమితి) కూడా పోటీకి సిద్ధమవుతుండటం ఓట్ల చీలికపై ప్రభావం చూపనుంది.షెడ్యూల్ ఇంకా వెలువడక ముందే మూడు ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో కసరత్తు మొదలుపెట్టడంతో, ఖైరతాబాద్ ఉపఎన్నిక రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై చైనా సుంకాల తగ్గింపు

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా నుంచి అత్యధికంగా దిగుమతి చేసుకునే సోయాబీన్స్‌ను ఈ మినహాయింపుల జాబితా నుంచి తప్పించింది. దీంతో అమెరికా సోయాబీన్స్‌పై అదనంగా 10 శాతం సుంకం కొనసాగనుంది.చైనా విడుదల చేసిన జాబితాలో మొక్కజొన్న, గోధుమలు, జొన్నలు, మాంసం, పాల ఉత్పత్తులు, కూరగాయల నూనెలు, సోయా నూనె, సోయా మీల్‌తో పాటు పలు వ్యవసాయ ఉత్పత్తులు ఉన్నాయి. 2024లో ఈ జాబితాలోని వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తుల వాణిజ్యం సుమారు 17 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు రాయిటర్స్ నివేదిక పేర్కొంది.**సోయాబీన్స్‌పై కొనసాగనున్న భారం** అమెరికా సోయాబీన్స్‌పై అదనంగా 10 శాతం సుంకం కొనసాగనుంది. ఈ సుంకం ప్రైవేటు సోయాబీన్ ప్రాసెసింగ్ సంస్థలకు భారంగా మారే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు చైనా ప్రభుత్వ రంగ సంస్థలు అమెరికా నుంచి సోయాబీన్స్ కొనుగోళ్లను కొనసాగిస్తున్నాయి. సినోగ్రెయిన్, కోఫ్కో సంస్థలు ఇప్పటికే 1.2 కోట్ల టన్నులకు పైగా అమెరికా సోయాబీన్స్‌ను కొనుగోలు చేసినట్లు సమాచారం.**30ఫర్30 జాబితాలు** అమెరికా, చైనాలు పరస్పరం సుంకాల తగ్గింపునకు సంబంధించిన '30ఫర్30' ఉత్పత్తుల జాబితాలను విడుదల చేశాయి. దాదాపు 30 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా సున్నితత్వం లేని ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు చైనా చర్యలు చేపట్టగా, అమెరికా కూడా చైనా నుంచి దిగుమతి చేసుకునే 77 రకాల వస్తువులకు సుంకాల సడలింపులను ప్రకటించింది. ఇరుదేశాలు వాణిజ్య సంబంధాల కోసం ప్రత్యేక వాణిజ్య మండలిని ఏర్పాటు చేసేందుకు అంగీకరించాయి.అమెరికాచైనా మధ్య ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమావేశం అనంతరం ఈ నిర్ణయాలు వెలువడ్డాయి. అయితే సోయాబీన్స్‌పై అదనపు సుంకం కొనసాగడం ఇరుదేశాల వ్యవసాయ వాణిజ్యంలో కీలక అంశంగా మారింది.

# తొలిసారి కక్ష్యలోకి స్టార్‌షిప్

(మొదటి పేజీ తరువాయి)

విజయాన్ని సాధించింది.ప్రయోగంలో భాగంగా 26 స్టార్‌లింక్ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ప్రయోగం అనంతరం సూపర్ హెవీ బూస్టర్ గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో నియంత్రితంగా దిగింది. మరోవైపు స్టార్‌షిప్ పైదశ తన కక్ష్య ప్రయాణాన్ని కొనసాగించింది.చంద్రుడు, అంగారక గ్రహం వంటి సుదూర లక్ష్యాలకు మానవులను, భారీ సరుకులను తరలించే పునర్వినియోగ అంతరిక్ష నౌకగా స్టార్‌షిప్‌ను స్పేస్‌ఎక్స్ అభివృద్ధి చేస్తోంది. ఈ విజయం సంస్థ భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

# తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు కీలక స్పష్టత

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనల ప్రకారం కనీసం నాలుగేళ్ల విద్యాభ్యాసం ఉండాల్సిందేనని స్పష్టం చేసినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారమే స్థానికతను నిర్ణయించాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది.స్థానికతకు సంబంధించిన నిబంధనలు ఏకపక్షంగా ఉన్నాయంటూ దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. పిటిషనర్ చేసిన వాదనలను పరిశీలించిన అనంతరం, తెలంగాణలో స్థానిక రిజర్వేషన్లకు వర్తించే నిబంధనలు రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిలోనే ఉన్నాయని స్పష్టం చేసినట్లు సమాచారం. **నాలుగేళ్ల విద్యాభ్యాసం కీలకం**తెలంగాణలో స్థానిక రిజర్వేషన్లకు అర్హతను నిర్ణయించేటప్పుడు విద్యాభ్యాస కాలానికి ప్రాధాన్యం ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రంలో కనీసం నాలుగేళ్లు చదివిన వారికి స్థానిక రిజర్వేషన్లకు అర్హత ఉంటుందని పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ విషయంలో గతంలో వెలువడిన సుప్రీంకోర్టు తీర్పులను కూడా ధర్మాసనం పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.స్థానికతకు సంబంధించిన నిబంధనలపై గతంలోనూ వివిధ కేసులు న్యాయస్థానాల ముందుకు వచ్చాయి. 2025లో సుప్రీంకోర్టు తీర్పులోనూ తెలంగాణ స్థానిక అభ్యర్థుల నిర్వచనం, విద్యాభ్యాసం, నివాసానికి సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.ఈ తాజా స్పష్టతతో తెలంగాణలో స్థానిక రిజర్వేషన్లకు సంబంధించిన అర్హతలపై మరింత స్పష్టత ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉన్నత విద్య, వృత్తి విద్యా కోర్సుల్లో స్థానిక కోటా వర్తింపుపై ఈ నిబంధనల ప్రభావం ఉండనుంది.

# ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాదం జరిగిన వెంటనే ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని పోలీసులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.మృతులను మందమర్రి మండలం పొన్నారం గ్రామానికి చెందిన లక్ష్మి, వెంకటాపూర్‌కు చెందిన అగ్గు సౌందర్య, సోనియా, సుమలతగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# విద్యుత్ బిల్లుతో ట్రాఫిక్ చలాన్లు లింక్ చేయాలా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని సూచించినట్లు సమాచారం.ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి జారీ చేసిన చలాన్లు పెండింగ్‌లో ఉండటం, వాటి వసూళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులపై విచారణ సందర్భంగా ఈ అంశం చర్చకు వచ్చింది. చలాన్లను క్రమబద్ధంగా వసూలు చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంపై కూడా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం తెలంగాణలో వాహనదారులు పెండింగ్ చలాన్లను అధికారిక ఈ-చలాన్ వ్యవస్థ ద్వారా పరిశీలించి, ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ఉంది. తెలంగాణ పోలీసుల అధికారిక ఈ-చలాన్ వ్యవస్థలో వాహన నంబర్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర వివరాలతో పెండింగ్ చలాన్లను పరిశీలించవచ్చు.చలాన్ల వసూళ్లను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమాచార అనుసంధానం, డిజిటల్ విధానాల వినియోగం వంటి అంశాలు పరిశీలనలోకి వస్తున్నాయి. అయితే విద్యుత్ బిల్లులతో చలాన్లను అనుసంధానించే విధానం అమల్లోకి వచ్చిందని చెప్పడానికి ప్రస్తుతానికి అధికారిక ధ్రువీకరణ అందుబాటులో లేదు.

# నిరసనలకు అడ్డాగా సచివాలయం

(మొదటి పేజీ తరువాయి)

అని ప్రభుత్వాన్ని నిలదీశారు.రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీలు ఏమయ్యాయని హరీశ్‌రావు ప్రశ్నించారు. దశాబ్దాల పాటు సేవలందించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవం ఇదేనా అని నిలదీశారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. సమస్యలపై ఆందోళన చేస్తున్న వారినే పట్టించుకోకపోవడం ప్రజా పాలనా అని ప్రశ్నించారు.

# మల్లంపల్లి అంగడి స్థలం ఎక్కడ?

**● 1972లో గ్రామం కోసం ఇచ్చిన రెండు ఎకరాలు.. ఐదు దశాబ్దాలుగా అంతుచిక్కని హక్కులు ● 2016లో కోర్టు తీర్పు.. అయినా హద్దులు తేల్చని అధికారులు ● ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా కదలని యంత్రాంగం**





**మల్లంపల్లి, సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామ అవసరాల కోసం ఐదు దశాబ్దాల క్రితం ఇచ్చినట్లు చెబుతున్న రెండు ఎకరాల భూమి ప్రస్తుతం ఎక్కడుంది? ఎవరి ఆధీనంలో ఉంది? రికార్డుల్లో దాని పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నలు మల్లంపల్లి ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. సర్వే నంబర్ 1లో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నట్లు చెబుతున్న ఈ భూమిపై ఏళ్లుగా వివాదం కొనసాగుతున్నా.. ఇప్పటివరకు హద్దులు నిర్ధారించకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**1972లో గ్రామ అవసరాల కోసం భూమి**

స్థానికుల ప్రకారం 1972లో పట్వారి రామనాథం అంగడి సంత నిర్వహణ కోసం తనకు చెందిన రెండు ఎకరాల భూమిని గ్రామ అవసరాల కోసం ఇచ్చినట్లు చెబుతున్నారు. జాతీయ రహదారిపై సంత నిర్వహణతో భద్రతా సమస్యలు ఏర్పడటంతో పోలీసుల సూచన మేరకు ఈ స్థలంలో అంగడి నిర్వహించినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

**2010లో వివాదం.. 16 మందికి జైలు**

భూమి విషయంలో 2010లో వివాదం తీవ్రరూపం దాల్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘర్షణలు, పోలీసు కేసులు, కోర్టు వ్యవహారాలు చోటుచేసుకున్నాయని, ఈ ఘటనకు సంబంధించి 16 మంది జైలుకు వెళ్లిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు గుర్తుచేస్తున్నారు.

**2016 కోర్టు తీర్పు.. అమలు ఎక్కడ?**

ఈ భూమికి సంబంధించి 2016లో కోర్టు తీర్పు వెలువడినట్లు స్థానికులు చెబుతున్నారు. తీర్పు అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి భూమి స్థితిని స్పష్టం చేయాల్సి ఉన్నప్పటికీ.. ఇప్పటికీ పూర్తి స్థాయి స్పష్టత రాలేదని వారు పేర్కొంటున్నారు. కోర్టు తీర్పు అనంతరం ఏ చర్యలు తీసుకున్నారు? సర్వే జరిగిందా? హద్దులు ఎందుకు నిర్ణయించలేదు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ప్రజావాణిలో ఫిర్యాదు**

భూమి రికార్డులను పరిశీలించి, హక్కులను నిర్ధారించి, కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ గ్రామస్తులు జిల్లా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ నెల 17న మల్లంపల్లిలో నిర్వహించిన ప్రజావాణిలోనూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంతో ఫిర్యాదు ఏ దశలో ఉందన్నది ప్రశ్నగా మారింది.

**కొత్త మండలానికి భూమి అవసరం**

2023లో మల్లంపల్లి మండలంగా ఏర్పడిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా అవసరాలకు స్థలాల అవసరం పెరిగింది. గ్రామ అవసరాల కోసం గతంలో ఉపయోగించిన భూమి వాస్తవంగా పంచాయతీకి సంబంధించినదైతే.. దానిని రక్షించి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

**తేలాల్సిన ప్రశ్నలు**

1972లో ఇచ్చినట్లు చెబుతున్న రెండు ఎకరాల భూమి రికార్డుల్లో ఎలా నమోదై ఉంది? 2016 కోర్టు తీర్పులో ఏముంది? ప్రస్తుతం భూమి ఎవరి ఆధీనంలో ఉంది? అధికారులు క్షేత్రస్థాయి సర్వే ఎందుకు నిర్వహించలేదు? ప్రజావాణి ఫిర్యాదుపై తీసుకున్న చర్యలేమిటి? అనే అంశాలపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ భూ వివాదానికి సమగ్ర సర్వే, అధికారిక రికార్డుల పరిశీలన ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని మల్లంపల్లి ప్రజలు కోరుతున్నారు.

# స్వంత గ్రామాన్ని, తల్లిదండ్రుల పేరు నిలబెట్టిన విగ్నేష్ యాదవ్

**● తెలంగాణ రాష్ట్రంలో మారుమోగుతున్న ఫతేపూర్ గ్రామం ● జాతీయ స్థాయి కరాటేలో తొర్రూరు విద్యార్థికి రెండు స్వర్ణాలు లభ్యం ● విద్యార్థికి వెల్లువెత్తుతున్న ప్రముఖుల ప్రశంసలు**



**తొర్రూరు ప్రతినిధి, సెప్టెంబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** పిట్ట కొంచెం – కూత గణం అనే సామెత ఊరికే రాలేదు అంటున్నారు ప్రముఖులు. మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని ఫతేపూర్ గ్రామంలో గట్టి గొర్ల సోమలింగం దంపతుల తనయుడు విగ్నేష్ యాదవ్. తల్లిదండ్రులు ఏనాడు కూడా అనుకోలేదు తన తనయుడు తల్లిదండ్రుల పేరుతో పాటు గ్రామం పేరు కూడా పాఠశాల పేరు, విద్య నేర్పిన గురువు పేరు నిలబెడతాడని ఊహించలేదు. విగ్నేష్ లోని ప్రతిభ, కసి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల శిక్షణ, తోటి మిత్రుల ప్రోత్సాహం అన్నీ కలగలిపిన అతనిలోని శక్తి కూడగట్టుకొని పోరాట శైలితో తన సత్తా చాటి తన గెలుపును నిరూపించుకోవాలని కసితో పోరాడి విజయం సాధించిన విగ్నేష్ యాదవ్. తొర్రూరు మండలంలోని సెయింట్ పాల్స్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. గత మూడు సంవత్సరాలుగా తొర్రూరుకు చెందిన ప్రముఖ కరాటే మాస్టర్ సోమా శ్రీధర్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. మహారాష్ట్ర ముంబయిలో సెప్టెంబర్ నెలలో నిర్వహించిన 37వ ఆల్ ఇండియా పోటీలుకాటాస్, స్పారింగ్ విభాగాల్లో విఘ్నేశ్ యాదవ్ ప్రతిభపతకాలు సాధించడంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. మహారాష్ట్ర రాజధాని ముంబైలో జరిగిన 37వ ఆల్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్‌లో తొర్రూరు మండలానికి చెందిన విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలతో మెరిశాడు. 'వరల్డ్ ఫునాకోషి శోతోకాన్ కరాటే ఆర్గనైజేషన్' ఆధ్వర్యంలో కెన్యా, శ్రీలంక, నేపాల్, దక్షిణాఫ్రికా దేశాల సంయుక్త భాగస్వామ్యంతో ముంబై (ములుండ్ వెస్ట్) లోని ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ పోటీలు ఘనంగా జరిగాయి. ఈ పోటీల్లో అండర్-12 బాలుర ఆరెంజ్ కేటగిరీలో తొర్రూరు మండలం ఫతేపురం గ్రామానికి చెందిన గట్టిగొర్ల సోమలింగం కుమారుడు విఘ్నేశ్ యాదవ్ పాల్గొన్నాడు. పోటీల్లో భాగంగా 'కాటాస్', 'స్పారింగ్' రెండు విభాగాల్లోనూ ప్రత్యర్థులపై పైచేయి సాధించి, ప్రథమ స్థానాల్లో నిలిచి రెండు బంగారు పతకాలను కైవసం చేసుకున్నాడు. విఘ్నేశ్ ప్రస్తుతం తొర్రూరులోని సెయింట్ పాల్స్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. గత మూడేళ్లుగా తొర్రూరుకు చెందిన ప్రముఖ కరాటే మాస్టర్ సోమ శ్రీధర్ వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి రెండు బంగారు పతకాలు సాధించిన విఘ్నేశ్‌ను మాస్టర్ సోమ శ్రీధర్, పాఠశాల యాజమాన్యం, ఫతేపురం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.. ఇలాంటి బంగారు పతకాలు మరెన్నో గెలుచుకోవాలని విగ్నేష్ యాదవ్ ను అందరూ దీవించండి.

# కపిల్ చిట్‌ఫండ్‌లో అంతా మోసం.?

**- చిట్టీ కట్టినా.. చెల్లింపు కోసం కన్నీళ్లే!**

**- పాట పాడి 16 నెలలు గడిచినా రూ.7 లక్షలు అందని వేదన..**

**- అధిక పెనాల్టీలు, కొర్రీల పేరుతో కాలయాపన చేస్తున్నారంటూ బాధితుడు అర్వపల్లి రామ్మోహన్ రావు అండ్ రేవంత్ ఆరోపణ**




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** "అవసరానికి ఆదుకుంటుంది. కష్టకాలంలో ఆసరాగా నిలుస్తుంది" అనే నమ్మకంతో చెమటోడ్చి సంపాదించిన కష్టార్జితాన్ని కపిల్ చిట్‌ఫండ్ లో దాచుకుంటే, చివరకు ఆ కుటుంబానికి గుండెకోతే మిగిలింది. ఆపదలో ఆదుకోవాల్సిన డబ్బుల కోసం నెలల తరబడి కాళ్ళరిగేలా తిరిగినా ఫలితం లేకపోవడమే కాకుండా, రకరకాల కొర్రీలు పెడుతూ మానసిక వేదనకు గురిచేస్తున్నారని ఇల్లందుకు చెందిన అర్వపల్లి రామ్మోహన్రావు, రేవంత్ కన్నీటి పర్యంతమయ్యారు. సోమవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు రామ్మోహన్రావు తన ఆవేదనను వెలిబుచ్చారు. కపిల్ చిట్ ఫండ్ ఇల్లందు బ్రాంచ్ లో రూ. 15 లక్షల విలువైన రెండు చిట్టీలు వేసి, క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తూ వచ్చామని తెలిపారు. అయితే, ఒకసారి బ్రాంచ్ మేనేజర్ కి కట్టిన డబ్బులను సంస్థ ఖాతాలో జమ చేయకుండా కాలయాపన చేసి, తిరిగి తనపైనే భారీగా పెనాల్టీ విధించారని వాపోయారు. ఈ అన్యాయాన్ని గట్టిగా నిలదీసినందుకు, తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఇల్లందు బ్రాంచ్ నుండి ఖమ్మం బ్రాంచ్ కు మార్చేసి, తనకు తెలియకుండానే మరో ఇద్దరిని షూరిటీలుగా చేర్చుకున్నారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా, తను పాడని మరో చిట్టీ నుండి పాడిన చిట్టీకి డబ్బును అనధికారికంగా బదిలీ చేశారని, ఖాళీ కాగితాలపై నోటీసుల పేరుతో నాటకమాడుతూ మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిట్టీ పాడి 16 నెలలు గడుస్తున్నా, రావాల్సిన రూ. 7 లక్షల పైకాన్ని (వడ్డీతో సహా) చెల్లించకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని కన్నీరు మున్నీరయ్యారు. కపిల్ చిట్ ఫండ్ యాజమాన్యం తీరుపై ఇప్పటికే చిట్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్, ఐజీ, డిఐజీ లకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి, తనకు రావాల్సిన డబ్బులను వడ్డీతో సహా ఇప్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు. తక్షణమే న్యాయం జరగకపోతే, కపిల్ చిట్ ఫండ్ వల్ల నష్టపోయిన మిగతా బాధితులను, తమ కుటుంబ సభ్యులను కలుపుకొని ఖమ్మం చిట్ ఫండ్ కార్యాలయం ఎదుట మహా ధర్నా చేపడతామని హెచ్చరించారు.

## మెలిట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 4 లక్షల విలువైన విద్యా, ఆట వస్తువుల పంపిణీ





**హనుమకొండ, సెప్టెంబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** వయోజన విద్యను ప్రోత్సహించడానికి, పిల్లల వికాసానికి మెలిట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 4,00,000 విలువైన విద్యా సామగ్రి, ఆట వస్తువుల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 30 గ్రామాల్లోని 900 మంది వయోజనులకు నిరక్షరాస్యత నిర్మూలన కోసం, అలాగే 30 'ఆఫ్టర్ స్కూల్ క్లబ్' సెంటర్లలోని 1200 మంది విద్యార్థుల కోసం పాఠ్య పుస్తకాలు, పలకలు, బ్లాక్ బోర్డులు, ఆట వస్తువులను అందజేశారు. పిల్లల్లో చదువుతో పాటు ఆటలు, పాటల్లో ప్రతిభను వెలికితీసేందుకు క్లబ్ లీడర్లు, టీచర్లను నియమించారు. ట్రస్ట్ అధినేతలు బిషప్ కాత మార్టిన్ లూథర్, బిషప్ కాత ప్రసన్న మార్టిన్ మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యం, సాంఘిక అభివృద్ధికి తమ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవ భారత్ నేతలు రెవ. డాక్టర్ +. జాన్ పాల్, మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, సీబీసీ జాయింట్ సెక్రటరీ నల్ల జాన్సన్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ పుల్ల శ్రీను, రెవ. గడ్డం ప్రతాప్ పాల్గొని ట్రస్ట్ సేవలను అభినందించారు. రెవ. వడ్నాల రాము వాక్య సందేశం అందించగా, మొత్తం 150 మంది ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సేవలకు నేషన్ బిల్డర్ 2026 పురస్కారం

**● ఉమ్మడి వరంగల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సదాలక్ష్మికి గుర్తింపు**





**హనుమకొండ, సెప్టెంబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకితభావంతో సేవలందిస్తున్న ముతోజు సదాలక్ష్మికి రోటరీ క్లబ్ హనుమకొండ అరుదైన గౌరవాన్ని అందించింది. నేషన్ బిల్డర్2026 అవార్డులో భాగంగా ఆమెను ఉమ్మడి వరంగల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసి పురస్కారంతో సత్కరించింది. భీమారం గ్రామానికి చెందిన సదాలక్ష్మి ప్రస్తుతం వరంగల్ కృష్ణ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో సాంఘిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యారంగంలో ఆమె అందిస్తున్న సేవలను గుర్తించిన రోటరీ క్లబ్ హనుమకొండ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. అవార్డు ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ హాజరయ్యారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు వంగ రాజిరెడ్డితో కలిసి ఆయన సదాలక్ష్మికి నేషన్ బిల్డర్2026 పురస్కారాన్ని అందజేశారు. పురస్కారం అందుకున్న సందర్భంగా ఉపాధ్యాయురాలు సదాలక్ష్మి మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి అవార్డుతో గౌరవించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయురాలిగా విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. సదాలక్ష్మి ఉమ్మడి వరంగల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం పట్ల తెలంగాణ ఉద్యమ కారుడు ఆకుల కుమార్, స్థానికుడు కొక్కొండ రాజేశ్వరరావు అభినందనలు తెలిపారు. అనంతరం అవార్డు గ్రహీత సదాలక్ష్మిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# లైసెన్స్‌డ్ సర్వేయర్లపై భూయజమానుల ఆరోపణలు

**- మోకా రిసర్వే నిర్వహించి భూ హద్దులు తేల్చాలని డిమాండ్**



**మల్లంపల్లి, సెప్టెంబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్):** రామచంద్రపురం శివారు-2లోని సెక్టార్-7లో లైసెన్స్‌డ్ సర్వేయర్లు నిర్వహించిన సర్వేలో తమ భూముల వివరాలను సక్రమంగా నమోదు చేయకుండా పలువురికి నోటీసులు జారీ చేశారని భూయజమానులు తిప్పని రవీందర్, బొల్లపల్లి కుమారస్వామి ఆరోపించారు. తమ కుమారుల పేర్లపై 16 ఎకరాల 12 గుంటల భూమికి పట్టాలు ఉన్నాయని, పట్టా పాస్‌బుక్కులు, లింక్ డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. సంబంధిత పత్రాలను పరిశీలించకుండానే సర్వే చేయడంతో వివాదం ఏర్పడిందన్నారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, క్షేత్రస్థాయిలో మోకా రిసర్వే నిర్వహించి భూమి హద్దులను నిర్ధారించాలని, అన్ని పత్రాలు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి న్యాయం చేయాలని వారు కోరారు.

## కమలాపూర్ ప్రజావాణిలో 28 దరఖాస్తులు: ఎంపీడీవో గుండె బాబు



**కమలాపూర్ సెప్టెంబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో గుండె బాబు, కమలాపూర్ డిప్యూటీ ఎమ్మార్వో ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకుని వారి నుండి దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ,హౌసింగ్,మండల పరిషత్ సంబంధించిన సమస్యలు విద్యుత్ శాఖ,ఇతర శాఖలకు ప్రజల నుండి 28 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో గుండె బాబు తెలిపారు.

# నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలి

- రాఘవపూర్ సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలి
- ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు



**పెద్దపల్లి సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూన్యూస్):** పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ పలువురు గ్రామస్థులు విచారణకు డిమాండ్ చేశారు. పంచాయతీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా మళ్లించి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుకు ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామపంచాయతీకి వివిధ రూపాల్లో వచ్చిన నిధులను నిబంధనల ప్రకారం వినియోగించకుండా దారిమళ్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ నిధుల వినియోగంపై సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను నిగ్గుతేల్చాలని కోరారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలితే సంబంధిత సర్పంచ్ తాడిశెట్టి చామంతి, ఉప సర్పంచ్ కొడపత్రి వినోద్, పంచాయితీ కార్యదర్శితో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. **నిధులు రికవరీ చేయాలి.** పంచాయతీ నిధుల దుర్వినియోగంతో గ్రామ అభివృద్ధికి విఘాతం కలిగిందని గ్రామస్థులు పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిని విధుల నుంచి తొలగించడంతోపాటు దుర్వినియోగమైన మొత్తాన్ని పూర్తిగా రికవరీ చేయాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. ఫిర్యాదుపై అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని కుమ్మరి తిరుమల్, మోలుమూరి వంశీ, కుమ్మరి సదయ్య, కుమ్మరి నిరంజన్, కుమ్మరి సది, శ్రవణ్ తెలిపారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంత్రి సీతక్క హామీ...

## అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తాం: మంత్రి సీతక్క

**ములుగు జిల్లా సెప్టెంబర్28(పిసిడబ్ల్యూ న్యూస్):** జర్నలిస్టులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హామీ ఇచ్చారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా కృషి చేస్తానని తెలిపారు. ములుగు నూతన కలెక్టరేట్‌లో సోమవారం ప్రింట్ మీడియా జర్నలిస్టులు మంత్రి సీతక్కను కలిసి తమ సమస్యలను వివరించారు. జర్నలిస్టులకు ఇళ్ల



స్థలాలు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. మంత్రి సానుకూలంగా స్పందించడం తో ఇళ్ల స్థలాల కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల్లో ఆశాభావం వ్యక్తమైంది. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా జర్నలిస్టులు బొమ్మన బోయిన పృథ్వీరాజ్, రామిడి కృష్ణారెడ్డి, గంద్రకోట విష్ణు, కొమురయ్య, జాలిగం శ్రీనివాస్, బిక్కనూరి సుమన్, రాజవర్ధన్, శంకర్, గంగాధర్ రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి: ప్రజావాణిలో వినతి

**ములుగు, సెప్టెంబర్ 28: (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. భూమిలేని పేద కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేర్చేలా అర్హులను గుర్తించి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని అధికారులను కోరారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకుని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారని అధికారులు తెలిపారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి స్థలాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు పేర్కొంటున్నారు. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన గుడిసేవ కమల పుష్పావతి మరియు రాజ్యలక్ష్మి అలాగే పలువురు ప్రజావాణి అధికారికి ఇంటి స్థలం కోసం దరఖాస్తు ఇవ్వడం జరిగింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ప్రజావాణిలో నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని వాటితో పాటు ఇందిరమ్మ ఇండ్లు కూడా మంజూరు చేసిన ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వాగ్దానం చేయడం జరిగింది. కమలాపురం గ్రామానికి చెందిన గుడిసేవ కమల పుష్పావతి మండల ప్రజావాణి అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. మంగపేట మండలంలో కమల పుష్పావతి లాంటివారు అనేకమైన నిరుపేదలు ఇంటి స్థలాలు లేని వారు ఉన్నారని ప్రజలు పత్రిక ముఖంగా అనడం జరుగుతుంది ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాలు లేని వారిని గుర్తించి ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వ అధికారులను ప్రజలు కోరుకుంటున్నారు.




# మతోన్మాదం, అసమానతలకు వ్యతిరేకంగా యువత పోరాడాలి






**ములుగు, సెప్టెంబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** మతోన్మాదం, కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా యువత ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుని ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 119వ జయంతి, జాషువా 131వ జయంతిని పురస్కరించుకుని కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం ప్రవీణ్ మాట్లాడుతూ భగత్‌సింగ్, జాషువా ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. కుల, మత వివక్షలకు వ్యతిరేకంగా సమాజంలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. విద్య, ఉపాధి, సామాజిక న్యాయం కోసం ప్రజాస్వామ్య మార్గాల్లో పోరాటాలు నిర్వహించాలని సూచించారు. యువత మత్తు పదార్థాలు, గంజాయి, పందేలు వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలని సూచించారు. స్వచ్ఛంద రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చని, యువత పెద్ద సంఖ్యలో రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్, కేజీకేఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులతో పాటు పలువురు కార్యకర్తలు, యువత పాల్గొని రక్తదానం చేశారు.

# మల్లంపల్లిలో ఎరువుల దుకాణాలపై అధికారుల తనిఖీలు

**- అనుమతి లేని ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు: ఏఈ శ్రీధర్**



**మల్లంపల్లి, సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** రైతులకు నాణ్యమైన ఎరువులు అందించడంతో పాటు, ఎరువుల అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు తనిఖీలు చేపట్టారు. మల్లంపల్లి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులు, గోదాంలను ఏఈ శ్రీధర్ ఆధ్వర్యంలో అధికారులు సోమవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా శ్రీ నాగార్జున, సుధ, సృజన, వెంకటేశ్వర, అగ్రోస్ తదితర ఫర్టిలైజర్ షాపులను సందర్శించారు. దుకాణాల్లోని ఎరువుల నిల్వలను పరిశీలించడంతో పాటు స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, ఎరువుల విక్రయాల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఈ శ్రీధర్ మాట్లాడుతూ.. అనుమతి లేని ఎరువులు, నిబంధనలకు విరుద్ధమైన మిశ్రమాలను రైతులకు విక్రయించరాదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి అనధికారిక ఎరువులు లేదా మిశ్రమాలు విక్రయించినట్లు గుర్తిస్తే ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎరువులు విక్రయించే సమయంలో తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, స్టాక్ వివరాలను రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఎరువుల నిల్వలు, నాణ్యత, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నాణ్యమైన ఎరువులు అందేలా వ్యాపారులు నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు.

# బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి



**కరీంనగర్, సెప్టెంబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్):** భారత విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 120వ జయంతి వేడుకలను కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమానికి ఆకర్షితుడై బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి భగత్‌సింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు కుసుంబ కృష్ణారావు, శ్రవణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, బీమా సాహెబ్, జనరల్ సెక్రటరీ సీహెచ్ కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి సుంకె దేవకిషన్, సాంస్కృతిక, క్రీడల కార్యదర్శి బెజ్జంకి శ్రీకాంత్, సీనియర్ ఈసీ చెల్లోజు భూమాచారి, మదన్‌మోహన్, అనురాధ, జూనియర్ ఈసీ శాంతికుమార్‌తో పాటు సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

# జీసీఈఓ గాయత్రి తీరుపై ఆగ్రహం..!

## కేజీబీవీ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఆరోపణలు

## మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా.. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆందోళన.

**మహబూబాబాద్. సెప్టెంబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** మహబూబాబాద్ జిల్లా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న సీఆర్‌టీలు, స్పెషల్ ఆఫీసర్లను జీసీఈఓ గాయత్రి అమె భర్త ప్రభాకర్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ మహబూబాబాద్ జిల్లాలో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. జీసీఈఓ తీరుపై పూర్తిస్థాయి విచారణ జరిపి,తక్షమే ఆమెను విధుల నుంచి తొలగించి.అమె భర్త ప్రభాకర్ సెల్ పోన్ స్వాధీనం చేసుకొని ఎస్ఓ లతో జరిగిన లావాదేవీల వ్యవహారం పై .వాట్సాప్ కాల్స్ పై పూర్తి స్థాయి లో విచారణ చేయాలని ఎస్ఎఫ్ఐతో పాటు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు మాట్లాడుతూ.. కేజీబీవీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జీసీఈఓ గాయత్రిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యత




వహించాల్సిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. **1516 ఏళ్లుగా సేవలందిస్తున్న ఉద్యోగుల పరిస్థితి ఏమిటి?** కేజీబీవీల్లో సీఆర్‌టీలు, స్పెషల్ ఆఫీసర్లు తక్కువ వేతనాలతో అధిక శ్రమతో పనిచేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఏదైనా పొరపాటు జరిగినప్పుడు దానిని సరిదిద్దే అవకాశం ఇవ్వకుండా షోకాజ్ నోటీసులు జారీ చేయడం, టర్మినేషన్‌కు సిఫారసు చేయడం జరుగుతోందని వారు ఆరోపించారు. ఏళ్ల తరబడి కేజీబీవీ వ్యవస్థలో పనిచేస్తూ, దానినే నమ్ముకుని జీవిస్తున్న ఉద్యోగులను అకారణంగా విధుల నుంచి తొలగిస్తే వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. **'ఉద్యోగులకు న్యాయం చేయాలి'** జీసీఈఓను విధుల నుంచి తొలగించి, కేజీబీవీ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ఉద్యోగులపై చర్యలు తీసుకునే





ముందు వారికి తమ వాదనను వినిపించే అవకాశం కల్పించాలని, సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని కోరింది. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఏ. మురళీకృష్ణ, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి దేవేందర్ రాజు, టీఎస్‌టీఎఫ్ అధ్యక్షులు భద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎం.డి. అమీర్‌తో పాటు మహబూబాబాద్ పట్టణ నాయకులు నవీన్, సాయికుమార్, రవికుమార్, అవినాష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.


# వేములవాడ కాంగ్రెస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా అబ్దుల్ రజాక్

**- నియామక పత్రం అందజేసిన వి. హనుమంతరావు, రియాజ్**

**సిరిసిల్ల, సెప్టెంబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్):** వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు మహమ్మద్ అబ్దుల్ రజాక్ నియమితులయ్యారు. సోమవారం సిరిసిల్లలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సలహాదారు, మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు రియాజ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వేములవాడలో మైనార్టీ




విభాగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మహమ్మద్ షాహిద్ పాషా, మహమ్మద్ సోహెల్ ఖాన్, మహమ్మద్ ఫసీ ఉద్దీన్, సయ్యద్ షబ్బీర్, ఎదురుగట్ల రాము తదితరులు పాల్గొన్నారు.



DISTRICT CONGRESS COMMITTEE
MINORITY DEPARTMENT
RAJANNA SIRCILLA

SHAIKH RIYAZ
DCC MINORITY CHAIRMAN
Cell : 94415 94822

Office : 9-4-102, New Bus Stand Road, Beside BSNL Office, Sircilla.
Resi : H.No. 10-3-60, Indiranagar, SIRCILLA - 505 301.
Dist : Rajanna Sircilla.

Date : 28/09/026

MOHAMMED ABDUL RAZZAKH, S/o. Abdul Hakim

"With a great pleasure I have to inform you that you are hereby appointed as a **Minority Town Chairman of Vemulawada,** Minority Department of District Congress Committee.

"I hope you will discharge your duties to strengthen Minority Department and in turn Congress Party in the Town under leadership of Mrs. Mallikarjuna Kargheji, Mrs. Sonia Gandhiji, Mr. Rahul Gandhiji, Mr. Revanth Reddyji and Mr. Mallu Bhatti Vikramarkaji, State Minority Chairman Mohammad Irfan Ali, Shaik Riyaz Saheb

With Regards

SHAIKH
DCC MINORIT
RAJANNA

# కరీంనగర్‌లో ఘనంగా 'శాతవాహన గ్రామీణ సంత' ప్రారంభం..

**- స్వదేశీ ఉత్పత్తులు, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 40 స్టాల్స్‌తో ఏర్పాటు..**






**కరీంనగర్, సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సోమవారం రోజున కరీంనగర్ పట్టణంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో 'శాతవాహన గ్రామీణ సంత' ఘనంగా ప్రారంభమైంది. గ్రామ భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ గ్రామీణ సంత నగర ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో వివిధ రకాల గ్రామీణ ఉత్పత్తులతో కూడిన మొత్తం 40 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. చేనేత వస్త్రాలు, సేంద్రియ (ఆర్గానిక్) ఆహార పదార్థాలు, మట్టి పాత్రలు, హస్తకళలు, మూలికా ఆరోగ్య ఉత్పత్తులు ఈ సంతలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇట్టి ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా, ప్రధాన వక్తగా హాజరైన జిల్లా సీనియర్ సిటిజన్ ప్రధాన కార్యదర్శి పెండ్యాల కేశవరెడ్డి, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ విక్రమ్ సింగ్ ఠాకూర్ లు మాట్లాడుతూ దేశీయ ఉత్పత్తులను ఆదరించడం ద్వారా స్థానిక చేతివృత్తుల వారికి, గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు..నేటి ఆధునిక ఉరుకుల పరుగుల జీవితంలో రసాయనాలకు దూరంగా ఉంటూ, ప్రకృతి సిద్ధమైన స్వదేశీ వస్తువులను వాడటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం, పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ఇలాంటి పర్యావరణ హిత ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ గ్రామీణ సంత కరీంనగర్ ప్రజలకు నూతన అనుభూతిని పంచుతుందని, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేసి గ్రామీణ కళాకారులను ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత గ్రామ వికాస్ సంయోజక్ జిన్నా సత్యనారాయణ రెడ్డి , సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ శంకరయ్య , గ్రామ భారతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ గాలి పెల్లి నాగేశ్వర్ , ప్రధాన కార్యదర్శి కూర్మాచలం మునిందర్ , ఉపాధ్యక్షులు క్యాస మధు , కార్యదర్శి గొల్లె తిరుపతి శివనాథుల స్వప్న , గ్రామ వికాస్ జిల్లా సంయోజక్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వ్యతిరేక స్కిట్‌కు ద్వితీయ బహుమతి

**● సీరత్ ఎక్స్‌పోలో కరీంనగర్ మైనార్టీ బాయ్స్3 విద్యార్థుల ప్రతిభ**



**కరీంనగర్, సెప్టెంబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్):** జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'సీరత్ ఎక్స్‌పో'లో మొగ్దుంపూర్ శివారులోని మైనార్టీ గురుకుల కరీంనగర్ బాయ్స్3 పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి సాధించారు. 'యాంటీ డ్రగ్స్' సామాజిక అంశంపై విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ ప్రేక్షకులను, న్యాయ నిర్ణేతలను ఆకట్టుకుంది. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను తమ నటన ద్వారా చక్కగా వివరించి సామాజిక సందేశాన్ని అందించారు. ద్వితీయ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నిర్వాహకులు రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పోరండ్ల చంద్రమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ కలిగించే కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. బహుమతి సాధించిన విద్యార్థులతో పాటు వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు.

# దేశానికి నేనేమి ఇవ్వగలనో ఆలోచించాలి

**● భగత్‌సింగ్ త్యాగాలు, ధైర్యసాహసాలు యువతకు స్ఫూర్తిదాయకం: మేయర్ కొలగాని శ్రీనివాస్**




**కరీంనగర్, సెప్టెంబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్):** "ఈ దేశం నాకేమిచ్చిందని కాదు.. దేశానికి నేనేమి ఇవ్వగలనని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి" అని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. సోమవారం మేయర్ క్యాంపు కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ చిన్న వయసులోనే జలియన్‌వాలాబాగ్ ఘటన భగత్‌సింగ్‌పై తీవ్ర ప్రభావం చూపిందని, దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. భగత్‌సింగ్‌తో పాటు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలు భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయమన్నారు. నేటి యువత భగత్‌సింగ్ దేశభక్తి, నిర్భయత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశభక్తి కేవలం నినాదాలకే పరిమితం కాకుండా సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడం, ప్రజాసేవలో భాగస్వాములు కావడమేనన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కే. యాదవ రాజు, రాష్ట్ర నీఫా కన్వీనర్ ఎం.డి. తాహిర్ పాషా, నీఫా, ఎన్‌వైపీ కార్యకర్తలు, డివిజన్ పెద్దలు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో సీఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు

**- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష.. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ పరిశీలన**





**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. సోమవారం కలెక్టరేట్‌లో ప్రిన్సిపల్ సెక్రెటరీ, జిల్లా కలెక్టర్, అధికారులతో ప్రజాప్రతినిధులు సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, రాజన్న సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ తదితరులు పాల్గొని సభ ఏర్పాట్లపై చర్చించారు. సభా ప్రాంగణం, ప్రజల రాకపోకలు, ట్రాఫిక్, పార్కింగ్, భద్రత, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్ సమీపంలోని మైదానంలో సీఎం సభ జరగనుంది. పర్యటనలో భాగంగా జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సిరిసిల్ల పట్టణంలో సుమారు 4 కిలోమీటర్ల మేర ర్యాలీ లేదా పాదయాత్రకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, పోలీస్ శాఖ, ప్రజాప్రతినిధు లు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

# అన్ని దానాల్లోకెల్లా గొప్పది రక్తదానం

**● ఆపదలో ఉన్నవారికి ప్రాణదానంతో సమానం: బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం**





**కరీంనగర్, సెప్టెంబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్):** సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మానకొండూరు మండల కేంద్రంలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తిమ్మాపూర్, మానకొండూరు, శంకరపట్నం మండలాల యువమోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని, ఆపదలో ఉన్నవారికి రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. యువత సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం దేశ హితం కోసం సాగిందని సాయిని మల్లేశం పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# మోడీ వ్యవసాయ విధానాలు ప్రమాదకరం







**- ఏఐకెయంయస్ జాతీయ మహాసభల్లో వక్తల ఉద్ఘాటన**






**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మోడీ దేశంలో అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలు అత్యంత ప్రమాదకరం అయినవిగా అఖిలభారత కిసాన్ మజ్దూర్ సభ ప్రదాన కార్యదర్శి డాక్టర్ అశీష్ మిట్టల్ వర్ణించారు. దొంగ దొంగ తనం చేస్తూ పట్టుబడినా దొంగ వెనక్కు తగ్గనట్లు, రైతు ఉద్యమానికి తలొగ్గి నల్లచట్టాలు వెనక్కి తీసుకున్నప్పటికీ తిరిగి స్వేచ్ఛ వాణిజ్యం పేరుతో రైతు-కూలీ వ్యతిరేక వైఖరి మోడీ అనుసరిస్తున్నారని దుయ్యబట్టారు. స్వేచ్ఛ వాణిజ్యం పేరుతో ఇతర దేశాలకు మేలు చేసే విదానాలు మోడీ అనుసరిస్తున్నాడని విమర్శించారు. కార్పోరేట్ శక్తులకు వ్యవసాయ రంగం అప్పగించడం ద్వారా మోడీ వ్యవసాయ రంగంను దెబ్బ తీయాలనే ప్రయత్నంలో ఉన్నారని, ఆ ప్రయత్నాలను ఐక్య రైతు ఉద్యమం ఎదుర్కొంటుందని అన్నారు. ఉత్తర భారతదేశంలోనే కాదు దక్షిణ భారతదేశంలో కూడా రైతు ఉద్యమాలు ఉప్పొంగాలసిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణా రాష్ట్రంలో అనేక భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాలు చేసిన చరిత్ర ఏఐకెయంయస్ కు ఉందని అన్నారు. తెలంగాణా రాష్ట్రంలో కూడా ల్యాండ్ మాఫియా కు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉంటూందని అన్నారు. మోడీ రైతులపై కార్చేది మొసలి కన్నీరు మాత్రమేనని అన్నారు. రైతులకు ఇచ్చే కరెంటు యూనిట్ కు ఎక్కువ రేటుకు ఇస్తూ, అదే కార్పోరేట్ శక్తులకు, పారిశ్రామిక వేత్తలకు చాలా తక్కవ రేటుకు విద్యుత్ అందిస్తున్నారని అన్నారు. కార్పోరేట్ కంపెనీలు వ్యవసాయ రంగంలో మోడల్ అబివృద్ధి అని చెప్పి భూములు అప్పగించి, ఆ భూముల్లో చాలా హాస్యాస్పదంగా యూకలిప్టస్ పంటలు వేస్తున్నారని, ఇలా రైతులకు కార్పోరేట్ శక్తులు అందించే మోడల్ నా అని ప్రశ్నించారు. దేశంలో కార్పోరేట్ తరహా వ్యవసాయ మోడల్ కోసం ప్రధాని మోడీ కుట్రలు చేస్తున్నారని అన్నారు. మూడు రైతు వ్యతిరేక నల్లచట్టాలు ఎదుర్కొన్న, త్రిప్పికొట్టిన విధంగా రైతాంగ ఐక్య ఉద్యమాలు నిర్మిస్తామని అన్నారు. శాంతిపూర్వకంగా నెలల పాటు డిల్లీలో రైతులు ఆందోళన చేసి నల్లచట్టాలు త్రిప్పి కొట్టిన విధంగా మరోసారి ఈ స్వేచ్ఛా వాణిజ్య విదానాలు, కార్పోరేట్ అనుకూల విధానాలపై పోరాడతామని అన్నారు. మోడీ చెబుతున్న కంపెనీ కాంటాక్ట్ మోడల్, జీరో బడ్జెట్ మోడల్ రెండు విఫలం ప్రయోగాలు అని అన్నారు. వ్యవసాయ రంగంలో స్వేచ్ఛ వాణిజ్య విధానం వలన శ్రీలంక ప్రభుత్వం సంక్షోభంలో కూరుకున్నా, మోడీ అదే విదానాలు పెట్టుకొని వేలాడుతున్నారన్నారు. తెలంగాణా గ్రామీణ ప్రాంతాలను హైదరాబాద్ తో వేరుచేసే కుట్రపూరిత ఆలోచన్లు కూడా మోడీ మదిలో ఉన్నాయని అన్నారు. ఏఐకేయంయస్ సభల్లో దేశంలో రావాల్సిన ఐక్య ఉద్యమాలు గురించి, గిరిజనుల, ఆదివాసీల, రైతుల భూ సమస్యలు, పంటలు గిట్టుబాటు దరలగురించి చర్చిస్తామని అన్నారు. స్వామినాదన్ రిపోర్ట్ లో సూచించిన విధంగా ప్రభుత్వాలు పంటలకు కనీస మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐకెయంయస్ ఉపాధ్యక్షుడు పంజాబ్ రాష్ట్రం కు చెందిన నిర్బయ్ సింగ్ మాట్లాడుతూ... మోడీ తెస్తున్న స్వేచ్ఛ వాణిజ్య చట్టాలు మూలంగా ఇతర దేశాల నుండి పాలు,మొక్కజొన్న కూడా దిగుమతి చేసుకునే దౌర్భాగ్య స్థితి ఉందని అన్నారు. ఈ బహిరంగసభలో ఏఐకెయంయస్ జాతీయ కార్యదర్శి ఒరిస్సా రాష్ట్రంకు చెందిన బాలచంద్ర షడంగి, బీహార్ రాష్ట్రానికి చెందిన కేదార్ సబాల్, అస్సాంకు చెందిన జెబజీత్, తమిళ నాడుకు చెందిన స్టాలిన్ బాబు, సెల్వరాజ్, కేరళకు చెందిన రాబిన్ ఝు, ఐఎఫ్టియు జాతీయ నేత టి.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం నేత చిట్టి పాటి వెంకటేశ్వర్లు, తెలంగాణా రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, గౌని ఐలయ్య, మామిడాల భిక్షపతి, వి.కోటేశ్వరరావు, బండారు ఐలయ్య, పిఓడబ్ల్యు జాతీయనేత గాదె ఝాన్సీ, ఏఐకేయంయస్ ఆహ్వానం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ యం.యఫ్ గోపినాథ్, టి.వేణు, తదితరులు ప్రసంగించారు. ఈ సభకు ఏఐకెయంయస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య అద్యక్షత వహించారు.

# విద్యార్థుల కష్టాలు తీర్చిన స్ఫూర్తి ఫౌండేషన్

**- 15 రోజుల్లోనే 50 డ్యూయల్ డెస్క్ బెంచీలు ఏర్పాటు**




**కల్లూరు, సెప్టెంబరు 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు మండలం చెన్నూరు గ్రామ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల కష్టాలను గుర్తించి స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్యూయల్ డెస్క్ బెంచీలు ఏర్పాటు చేశారు. ఎన్ డబ్ల్యు ఏ ఆశ్రయ యూఎస్ఏ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో రూ.3.40 లక్షల విలువైన 50 డ్యూయల్ డెస్క్ బెంచీలను ఆయా పాఠశాలలకు అందజేశారు. చెన్నూరు ఎంపీపీఎస్ (హెచ్ డబ్ల్యు)కు 12, ఎంపీపీఎస్ చెన్నూరుకు 15, ఎంపీపీఎస్ వెంకటరాంపురానికి 14, ఎంపీపీఎస్ రావికంపాడుకు 5, కల్లూరు జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ కాంప్లెక్స్ పరిధిలోని ఎంపీపీ ఎస్ అడివిబోడిమల్లె పాఠశాలకు 4 బెంచీలను కేటాయించారు. చెన్నూరు పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు బెంచీలు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సుమారు రెండు వారాల క్రితం జడ్.పి.హెచ్.ఎస్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ వి. ఝాన్సీరాణి స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఫౌండేషన్ నిర్వాహకులు కేవలం 15 రోజుల్లోనే బెంచీలను సమకూర్చడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల అవసరాన్ని గుర్తించి వెంటనే స్పందించిన ఫౌండేషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ నల్లజాల కిషోర్, చెన్నూరు కాంప్లెక్స్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మధు, చెన్నూరు హ్యాబిటేషన్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యర్నం అప్పారావు, మందడపు రమాదేవి, యర్నం నాగరాజు, ధరావత్ రాజు పాల్గొన్నారు.

# దేశంలో సమస్యల తీరు మారింది.. ప్రజా ఉద్యమమే మార్గం

● యువత ప్రశ్నించే తత్వాన్ని పాలకులు గుర్తించాలి: ఐఎఫ్‌టీయూ నేత ప్రసాద్




ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్): దేశంలో ప్రజల సమస్యల స్వరూపం మారిపోయిందని, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, కార్పొరేటీకరణ, వ్యవసాయ సంక్షోభం వంటి సమస్యలు సామాన్యులను ప్రభావితం చేస్తున్నాయని ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడు పి. ప్రసాద్ అన్నారు. సోమవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.రైతులు, కార్మికులు సమస్యలపై ఉద్యమాలు చేపట్టడం ప్రజాస్వామ్య చైతన్యానికి సంకేతమన్నారు. యువతను సామాజిక స్పృహ లేని తరంగా చిత్రీకరించిన సమయంలో జన్‌జీ ఉద్యమం ప్రశ్నించే తత్వానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధి ఫలాలు సామాన్య ప్రజలకు అందేలా ప్రభుత్వ విధానాలు ఉండాలని సూచించారు.రైతులు, కార్మికులు, యువత, ఉద్యోగుల సమస్యలపై విస్తృత ప్రజా ఉద్యమం నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. వామపక్ష శక్తులు సమన్వయంతో ప్రజా సమస్యలపై ఐక్య కార్యాచరణకు ముందుకు రావాలని కోరారు. ప్రజల గొంతును వినడం, నిరుద్యోగం, పేదరికం, వ్యవసాయ సమస్యలకు పరిష్కారాలు చూపడం పాలకుల బాధ్యత అని ప్రసాద్ అన్నారు.కార్యక్రమానికి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నామా పురుషోత్తం అధ్యక్షత వహించగా, జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కె. రాంనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎరుపెక్కిన ఖమ్మం

- పురవీధులలో కదంతొక్కిన వేలాది రైతు కూలీలు
- అరుణ వర్ణ పతాకాలతో ఎర్ర సముద్రమైన ఖమ్మం ఖిల్లా

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) : ఏఐకేయంయస్ 4వ జాతీయ మహాసభల సందర్భంగా సోమవారం ఖమ్మం పురవీదులు ఎరుపు మయం అయ్యాయి. ఉభయ తెలుగు రాష్ట్రలు, తమిళ నాడు, ఒరిస్సా, బీహార్, పంజాబ్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుండి వచ్చిన మహాసభలు ప్రతినిధులు, రైతుకూలీ లు ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రదర్శన స్థానిక పెవిలియన్ గ్రౌండ్ నుండి మొదలై ఎర్రజెండాలు చేతబట్టి మయూరి సెంటర్, అంబేద్కర్ సెంటర్, ఇల్లెందు క్రాస్ రోడ్ మీదుగా బహిరంగ సభాస్థలి యస్ఆర్ బిజీయన్ఆర్ కళాశాలకు చేరుకోవడానికి గంటన్నర సమయం పట్టింది. ప్రదర్శన అగ్రభాగాన కొమ్ము కళాకారులు, గిరిజన కళాకారులు, బంజారా కళాకారులు, డబ్బు దరువులు,








కోలాటం బృందాల కళా ప్రదర్శనలు ఎంతో ఆకట్టు కానున్నాయి. ఈ ప్రదర్శనకు వివిధ రాష్ట్రాల జిల్లా రైతుకూలీ సంఘం నాయకులు నాయకత్వం వహించారు. ఏఐకెయంయస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, ప్రదానం కార్యదర్శి అశీస్ మిట్టాల్, వెస్టుబెంగాల్ సుజయ్ ఝు, ఒరిస్సా నేత బాలచందర్ షడంగి, ఆంధ్రప్రదేశ్ నాయకులు సుధాకర్, చిట్టి పాటి వెంకటేశ్వర్లు, పంజాబ్ నిర్ణయంతో సింగ్, తెలంగాణా నుండి మండల వెంకన్న, వి.కోటేశ్వరరావు, బిక్షం, దుర్గాప్రసాద్, గౌని ఐలయ్య, జెవి చలపతిరావు, బండారి ఐలయ్య, ఆహ్వాన సంఘం అద్యక్ష కార్యదర్శులు డాక్టర్ యంయఫ్ గోపినాథ్, టి.వేణు తదితరులు నాయకత్వం వహించారు. ప్రదర్శన ఆసాంతం పట్టణ ప్రజలను ఆకట్టుకొంది. ప్రదర్శన ముందు కళా బృందాల ప్రదర్శన పట్టణ ప్రజలు ఆసక్తికరంగా తిలకించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- అర్జీలను సత్వరమే పరిష్కరించాలి: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్




కల్లూరు, సెప్టెంబరు 28 (పీసీడబ్ల్యూ న్యూస్) :కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీలు, వినతుల రూపంలో సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలు, వినతులను సబ్ కలెక్టర్ పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేశారు. ఆయా సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సబ్ కలెక్టర్ సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించి, పరిష్కారానికి తీసుకున్న చర్యలను సంబంధిత ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓట్ల చోరీకి నిరసనగా కాంగ్రెస్ మహాధర్నా

సీఈసీ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం.. రాజీనామాకు డిమాండ్

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్): ఓట్ల చోరీకి నిరసనగా ఏఐసీసీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ పిలుపు మేరకు ఖమ్మం ధర్నా చౌక్‌లో జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా నిర్వహించారు.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్, అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తీరుపై కాంగ్రెస్ నేతలు నిరసన వ్యక్తం






చేశారు. ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దిష్టిబొమ్మను దగ్ధం చేసి, అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించరాదని, ప్రతి అభ్యంతరాన్ని సమగ్రంగా పరిశీలించాలని కోరారు. ఓటు హక్కుపై ప్రజల్లో విశ్వాసం నిలిచేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలని అన్నారు.కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, డివిజన్, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌పల్లిలో యువకుడు దారుణ హత్య...

● కత్తితో పొడిచి చంపిన అదే గ్రామానికి చెందిన నిందితుడు. ● వ్యక్తిగత పాత కక్షలే కారణం. ● పెద్ద పాపయ్య పల్లె ఎస్ ఆర్ ఎస్ పి కెనాల్ దగ్గర ఘటన.



కమలాపూర్ సెప్టెంబరు 28(పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం పరిధిలోని ఉప్పులపల్లె గ్రామానికి చెందిన యువకుడు వడిగా రాకేష్ దారుణ హత్యకు గురయ్యాడు.కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండల పరిధిలోని పెద్ద పాపయ్య పల్లె సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఉప్పులపల్లె కు చెందిన ప్రశాంత్ అనే వ్యక్తి రాకేష్ పై కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు.తీవ్ర గాయాలతో రాకేష్ సంఘటన జరిగిన స్థలంలోనే మృతి చెందాడు. హత్యకు పాత కక్షలు కారణమని ప్రాథమికంగా తెలుస్తున్నప్పటికీ అసలు కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.హత్య జరిగిన అనంతరం నిందితుడు పోలీస్ స్టేషన్ కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.హత్యకు దారి తీసిన పరిస్థితులు నిందితుడు పాత్ర,పాత కక్షలకు సంబంధించిన వివరాలను పోలీసులు విచారిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

# కరీంనగర్‌లో కాంగ్రెస్ భారీ ర్యాలీ

కలెక్టరేట్ ఎదుట నిరసన.. జ్ఞానేష్ కుమార్, మోదీ, అమిత్ షా దిష్టిబొమ్మల దహనం

కరీంనగర్, సెప్టెంబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్): ఓట్ల చోరీని అరికట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ఇందిరాచౌక్ నుంచి కలెక్టరేట్ వరకు నల్ల రిబ్బన్లు ధరించి ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు.ఈ సందర్భంగా డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల సంఘం వ్యవహారంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, జ్ఞానేష్ కుమార్‌ను






తొలగించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని అన్నారు.మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తమైనట్లు పేర్కొన్నారు. జ్ఞానేష్ కుమార్‌ను తొలగించే వరకు దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు.కరీంనగర్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాపై రాహుల్ గాంధీ గతంలో చేసిన ఆరోపణలపై ఇప్పుడు చర్చ జరుగుతోందన్నారు. ఎన్నికల సంఘం వ్యవహారంపై సమగ్ర పరిశీలన అవసరమని పేర్కొన్నారు.మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్‌లో ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పురుమల్ల శ్రీనివాస్, వైద్యుల అంజన్‌కుమార్, ఒడితెల ప్రణవ్‌బాబు తదితర నాయకులతో పాటు జిల్లా, మండల, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత పోరాటం

- పాలస్తీనా, క్యూబా ప్రజలకు సంఘీభావం

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్): భగత్‌సింగ్ స్ఫూర్తితో అన్యాయానికి, అణచివేతకు వ్యతిరేకంగా యువత ఐక్యంగా పోరాడాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ నాయకులు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు.పాలస్తీనా ప్రజల హక్కులు, స్వయం నిర్ణయాధికారానికి సంఘీభావం ప్రకటించారు. క్యూబా ప్రజల సార్వభౌమత్వాన్ని గౌరవించాలని కోరారు. రైతులు, కార్మికులు, యువత సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడాలని పిలుపునిచ్చారు.




# గూనిపర్తిలో భూభారతి రీ-సర్వేపై గ్రామసభ



ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: తహసీల్దార్ సురేష్‌కుమార్




కమలాపూర్, సెప్టెంబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూనిపర్తి గ్రామంలో భూభారతి రీ-సర్వేపై గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ బుర్ర రాధిక కర్ణాకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి తహసీల్దార్ ఎం. సురేష్‌కుమార్ హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. రీ-సర్వేలో భాగంగా భూముల హద్దులను నిర్ణయించి, లైసెన్స్ కలిగిన సర్వేయర్లతో సర్వే నిర్వహిస్తారని తెలిపారు. సర్వే సమయంలో రైతులు తమ చుట్టుపక్కల భూముల యజమానులతో కలిసి హద్దుల నిర్ధారణకు సహకరించాలని కోరారు. రీ-సర్వే నిష్పాక్షికంగా జరుగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలను నిష్పాక్షికంగా పరిష్కరిస్తున్న జీపీవో కే. రాధికను తహసీల్దార్ సురేష్‌కుమార్, సర్పంచ్ బుర్ర రాధిక కర్ణాకర్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీపీవో రాధిక మాట్లాడుతూ ప్రజల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముడిద కృష్ణ, పంచాయతీ కార్యదర్శి యాక లక్ష్మి, వీబీజీ రాంజీ, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతి, సర్వేయర్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆదర్శ విప్లవ కమ్యూనిస్టు 'వడ్డె నాగయ్య'

**• సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సిపిఐ ఎంఎల్ మాస్ లైన్(ప్రజాపంథా) సీనియర్ నాయకులు వడ్డే నాగయ్య నిస్వార్థంగా, విప్లవ కమ్యూనిస్టు భావజాలంతో, పేద ప్రజలకోసం తన శక్తివంచన లేకుండా పాటుపడిన గొప్ప ఆదర్శ నాయకుడని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కొనియాడారు. సోమవారం ఖమ్మంలో, హరిత గార్డెన్స్ లో వడ్డే నాగయ్య సంతాప సభను పార్టీ డివిజన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా నాయకురాలు సిహెచ్ శిరోమణి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. సభకు హాజరైన బంధువులు, పార్టీ శ్రేణులు, నాయకులు వడ్డే నాగయ్యకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పోటు రంగారావు ప్రసంగిస్తూ, వడ్డే నాగయ్య ప్రజలను ప్రేమించాడని, వారి కష్టసుఖాలలో పాలుపంచుకున్నాడని వారికి ఏ సమస్య వచ్చినా అప్పుడుగా ఉండి పరిష్కారం చేయడంలో ముందుభాగాల నిలిచాడని ఆయన కొనియాడారు. రఘునాధపాలెం, కొనిజర్ల మండలంలో పేద ప్రజలు కొట్టుకున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పేద ప్రజలు నివసించడానికి కొత్త గ్రామాలను పార్టీ ఆధ్వర్యంలో నిర్మించారని, పార్టీ నాయకులు పొట్లపల్లి శ్రీశైలం, వల్లూరు వెంకయ్యలతో కలిసి పార్టీ అభివృద్ధి కోసం, ప్రజల బాగుకోసం కృషి చేసిన మహనీయుడని ఆయన అన్నారు. సారా వ్యతిరేక ఉద్యమంలో సారాను బంద్ పెట్టాలని పోరాటం చేసిన మహిళలను పోలీసులు గ్రామ నడి వీధిలో నిలబెట్టి, నిర్బంధించి, అవమానపరిచారని, భయపడకుండా, ఎంతో ధైర్యంతో



మహిళలను చైతన్యపరిచి, పోలీసు ఆగడాలను, అరాచకాలను ఎదిరించి, ఊరిని, ప్రజలను కాపాడుకున్న గొప్ప నాయకుడని ఆయన అన్నారు. 1970నుండి విప్లవ కమ్యూనిస్టు పార్టీని గ్రామంలో నిర్మాణం కోసం ప్రయత్నం చేస్తూ పార్టీని నిలబెట్టుటకు కృషి చేశారని, ఎమర్జెన్సీ కాలంలో ఆ తర్వాత కూడా రహస్య కామ్రేడ్లకు షెల్టర్ గా వేపకుంట్ల గ్రామాన్ని తయారు చేశారని, తన ఇల్లును కూడా విప్లవకారులకు ఆశ్రయంగా ఇచ్చారని నిర్బంధం ఉన్నప్పటికీ బెదరకుండా ఆటుపోట్లు వచ్చిన ఎదుర్కొని పార్టీ క్రమశిక్షణ పాటించిన మహనీయులని ఆయన అన్నారు. సరియైన విధానాలు అనుసరిస్తూ, ప్రతినిత్యం న్యూస్ పేపర్లు చదివి రచ్చబండ చర్చలు, దేశ పరిణామాలు, రాజకీయ విశ్లేషణ చేసి పార్టీ విధానాలు ఆర్గ్యుమెంట్ చేసే వాడని, మంచి క్రమశిక్షణ, నిబద్ధతకలిగి, నిజాయితీగా ఉండేవాడని, నమ్మిన సిద్ధాంతం పట్ల, నాయకుల పట్ల అచంచల విశ్వాసంతో ఉన్న కమ్యూనిస్టు విప్లవ నాయకుడని, గ్రామంలో విద్యాభివృద్ధి కోసం, పాలేర్ల వ్యవసాయ కూలీల వేతనాల పెంపుదల కోసం, రైతాంగ పంటలకు గిట్టుబాటు ధరల కోసం, తునికాకు రేట్ల పెంపుదల కోసం, భూపోరాటాలు చేసి, పేద ప్రజలకు భూములు పంచడానికి కృషిచేసిన ప్రజల మనిషని అయన అన్నారు.

1981 నుండి 88 వరకు వేపకుంట్ల గ్రామానికి ఉపసర్పంచిగా, ఉండి చెరువుకొమ్ము తండా వేపకుంట్ల ఎస్సీ, బీసీ కాలనీలకు విద్యుత్, రోడ్లు సౌకర్యాల కోసం అధికారుల వెంటబడి పరిష్కారం కోసం కృషి చేశాడని ఆయన అన్నారు. పార్టీ నాయకులు అమరులు రాయల సుభాష్ చంద్రబోస్, శ్రీశైలం, ధర్మన్న, ఎల్లన్న, రాయల నాగేశ్వరరావు తదితరుల సహచర్యంతో పేద ప్రజలను అమితంగా ప్రేమించి వారికోసం నిలబడిన విశాల హృదయం కలిగిన మనిషిని ఆయన అన్నారు. నేడు దేశంలో రాష్ట్రంలో పాలకులుగా ఉన్నవారు ప్రజల మీద అనేక రకాలుగా భారాలను మోపి ఇబ్బందులు పాలు చేస్తున్నారని పేద ప్రజలు మరింత పేదలుగా మారిపోతున్నారని, ప్రజలు చీలిపోకుండా ఐక్యంగా ఉండే ప్రభుత్వాల తప్పుడు విధానాలపై పోరాటాలు చేసి ఓడించాలని కోరారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ ఓట్ల చోరీ చేసి లక్షలాదిమంది యువతి యువకుల ఓట్లను గల్లంతు చేశాడని ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం అన్ని రంగాలను తన చేతిలోకి తీసుకొని, తమ అధికారాన్ని కాపాడుకోవటం కోసం దుర్వినియోగం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యంగా అదాని, అంబానీలను వెంటబెట్టుకొని దేశ సంపదను వారి చేతుల్లో పెడుతున్నారని ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సంతాప సభలో సర్పంచ్ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు పూసులూరి నరేందర్, కవి ఎన్ తిరుమల్, పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, పార్టీ జిల్లా నాయకులు జిరామయ్య, ఆవుల అశోక్, ఆర్ శివలింగం, మలీదు నాగేశ్వరరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి టీ ఝాన్సీ, బందెల వెంకయ్య, తిమ్మిడి డి హనుమంతరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, కె శ్రీనివాస్, పి శోభ, పోలిశెట్టిగూడెం మాజీ సర్పంచ్ రామయ్య, చావా రాము, కోయిని వెంకన్న, పార్టీ మండల కార్యదర్శి కేలోత్ లక్ష్మణ్, మేక రామనాథం, కురాకుల నరసయ్య, జాలాది లెనిన్, నాగయ్య అల్లుడు గుర్రం రవీందర్రావు, కుమారులు వడ్డే రామారావు, వడ్డే వీరభద్రం, భార్య అనసూర్యమ్మ, ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా జర్నలిస్టులు రాం నారాయణ, అప్పారావు, కె గణేష్, తుమ్మలపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

---

# హాస్టల్లో లేకుంటే సస్పెండ్

**- ఏ రాత్రైనా ఆకస్మిక తనిఖీలు:**

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**


**- సూపర్వైజింగ్ అధికారులు వారానికి రెండు హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలి**

**- నాణ్యత లేని ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించవద్దు**

**- సమస్యలను దాచకుండా తన దృష్టికి తీసుకురావాలి**

**- రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తప్పనిసరిగా సంబంధిత హాస్టళ్లలోనే అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం కంటే ముఖ్యమైనది మరొకటి లేదని,విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.రాష్ట్రంలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్‌లతో కలిసి పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ... రెసిడెన్షియల్ విద్యాసంస్థల వద్ద హాస్టల్ వెల్ఫేర్ అధికారులు అందుబాటులో లేకపోవడం వల్లే అనేక సమస్యలు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇకపై జిల్లాలో ఏ రాత్రైనా ఏ హాస్టల్‌నైనా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, తనిఖీ సమయంలో సంబంధిత హాస్టల్ వెల్ఫేర్ అధికారి అక్కడ అందుబాటులో లేకుంటే వెంటనే సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి హాస్టల్ వెల్ఫేర్ అధికారి తప్పనిసరిగా సంబంధిత హాస్టల్ లోనే ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.**వారానికి రెండు హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు :**సూపర్వైజింగ్ అధికారులు వారానికి కనీసం రెండు హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తనిఖీలకు ముందుగా ఎలాంటి సమాచారం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. పట్టణ పరిసర ప్రాంతాల్లోని హాస్టళ్లకే పరిమితం కాకుండా జిల్లా అంతర్గత ప్రాంతాల్లోని హాస్టళ్ల నుంచి తనిఖీలు ప్రారంభించాలని సూచించారు. ఇకపై తాను కూడా రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని కలెక్టర్ తెలిపారు. హాస్టళ్లలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని దాచాల్సిన అవసరం లేదని, తన దృష్టికి తీసుకువచ్చే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. **నాణ్యమైన ఆహారమే అందించాలి :**ప్రతి హాస్టల్ పరిధిలో వంట సిబ్బంది నిబంధనలను సక్రమంగా పాటించేలా



అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, శుచికరమైన, రుచికరమైన ఆహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. హాస్టళ్లకు సరఫరా అయ్యే ఆహార పదార్థాల నాణ్యతను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. నాణ్యత లేని ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించవద్దని, నాణ్యత సరిగా లేకుంటే వాటిని వెంటనే తిరిగి పంపించాలని స్పష్టం చేశారు.అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వంట సిబ్బంది, ఇతర సిబ్బందిలో ఎవరైనా విధులను సక్రమంగా నిర్వహించకపోతే వారిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. **కీలక సమస్యలకు యాక్షన్ టేకన్ రిపోర్ట్ తప్పనిసరి :**తనిఖీల సమయంలో కీలకమైన సమస్యలను గుర్తించిన అనంతరం వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై యాక్షన్ టేకన్ రిపోర్ట్ తప్పనిసరిగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్యలను గుర్తించడంతోనే సరిపెట్టకుండా, వాటి పరిష్కారం పూర్తయ్యే వరకు పర్యవేక్షించాలని సూచించారు. హాస్టల్‌లో వంట సిబ్బంది, ఇతర సిబ్బందికి సెలవులు ఇచ్చే విషయంలో సమన్వయంతో వ్యవహరించాలని, అవసరమైన సమయంలో సిబ్బంది అందుబాటులో లేకుండా చేసే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.**అవసరమైన సౌకర్యాలకు వెంటనే ప్రతిపాదనలు :**విద్యార్థుల సౌకర్యార్థం హాస్టళ్లలో ఏవైనా వస్తువులు, ఇతర సదుపాయాలు అవసరమైతే వెంటనే ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ పరిధిలో అందుబాటులో ఉన్న నిధుల నుంచి అవసరమైన మేరకు నిధులు మంజూరు చేసి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.**మన పిల్లల మాదిరిగానే గురుకులాల నిర్వహణ :**విద్యార్థుల సంక్షేమం కంటే ముఖ్యమైనది మరొకటి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. మన పిల్లలు ఉంటే ఎలా ఉండాలని మనం కోరుకుంటామో, అదేవిధంగా గురుకులాలను కూడా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ప్రతి హాస్టల్‌లో విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.

**ప్రతి నెల రెండు రోజులు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు :**ప్రతి నెల రెండవ, నాలుగవ బుధవారం సంబంధిత గ్రామపంచాయతీ లేదా మున్సిపాలిటీకి చెందిన పారిశుధ్య బృందం సంబంధిత గురుకుల విద్యాసంస్థకు వచ్చి ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, అధికారులు సమన్వయ ంతో పనిచేస్తూ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, మైనారిటీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ముజాహిద్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవిబాబు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ఫిరంగి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## నెట్‌ఫ్లిక్స్‌లోకి మెగాస్టార్ చిరంజీవి..
## పాడ్‌కాస్ట్‌తో సరికొత్త ప్రయాణం!



తెలుగు చిత్రసీమలో దాదాపు 48 ఏళ్లుగా అగ్ర కథానాయకుడిగా కొనసాగుతున్న మెగాస్టార్ చిరంజీవి, ఇప్పుడు సరికొత్త బాటలో ప్రయాణించేందుకు సిద్ధమయ్యారు. వెండితెరపై తన మాస్ ఇమేజ్‌తో ప్రేక్షకులను అలరిస్తూనే, మరోవైపు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తనదైన ముద్ర వేయనున్నారు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి ఆయన ఒక ప్రత్యేకమైన పాడ్‌కాస్ట్ సిరీస్ చేయబోతున్నారు. తొలుత చిరంజీవి జీవిత ప్రస్థానంపై ఒక డాక్యుమెంటరీని రూపొందించాలని భావించినప్పటికీ, పాడ్‌కాస్ట్ అయితే తన భావాలను మరింత స్వేచ్ఛగా, నేరుగా పంచుకోవడానికి వీలుంటుందని ఆయన భావించినట్లు తెలుస్తోంది. ఈ వినూత్న ఆలోచనను ఆయన కుమార్తె, నిర్మాత సుస్మిత కొణిదెలతో పాటు ప్రముఖ రచయిత బీవీఎస్ రవి ప్రతిపాదించగా, చిరంజీవి వెంటనే అంగీకరించినట్లు సమాచారం. ఇప్పటికే పలు విజయవంతమైన టాక్ షోలకు పనిచేసిన అనుభవం ఉన్న బీవీఎస్ రవి ఈ ప్రాజెక్టుకు రచన, రూపకల్పన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాధారణ ఇంటర్వ్యూలలో పంచుకోని ఎన్నో వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలు, స్టార్‌డమ్ వెనుక ఉన్న శ్రమ, సినీ ప్రస్థానంలోని ఎత్తుపల్లాలను ఈ పాడ్‌కాస్ట్ ద్వారా చిరంజీవి అభిమానులతో పంచుకోనున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను నెట్‌ఫ్లిక్స్ త్వరలోనే విడుదల చేయనుందని తెలుస్తోంది.

## మళ్ళీ అమ్మ సెంటిమెంట్ తో పూరి..




పూరీ జగన్నాథ్.. పేరు వింటేనే ఒక డిఫరెంట్ మేనరిజం, రా యాటిట్యూడ్ గుర్తొస్తాయి. ఆయన హీరోలు సమాజంతో గొడవ పడే విధానం చాలా కొత్తగా ఉంటుంది. కానీ ఈసారి పూరీ తన ట్రాక్ మార్చాడని తెలుస్తోంది. వరుస అప్డేట్స్ తో హీరో బిచ్చగాడిగా ఎలా మారాడు అనే కోణంలో క్యూరియాసిటి క్రియేట్ చేస్తున్నాడు. 'స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్' అనే టైటిల్ తోనే తన మార్క్ చూపించాడు. ఇక లేటెస్ట్ గా మరో గ్లింప్స్ వదిలారు. ఇందులో హీరో యాటిట్యూడ్ కన్నా ఎక్కువగా, ఒక బలమైన మదర్ సెంటిమెంట్ చుట్టూ కథను తిప్పబోతున్నట్లు హింట్ ఇచ్చారు. పూరి సినిమాల్లో మదర్ సెంటిమెంట్ కూడా డిఫరెంట్ గానే ఉంటుంది. చిరుత, అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి, లోఫర్, రోగ్, లైగర్.. ఇలా ఎక్కువ సినిమాల్లో అమ్మ ఎమోషన్ ను హైలెట్ చేశారు. ఇక ఈ సినిమాలో సీనియర్ నటి జరీనా వహాబ్ తల్లిగా 'జుబేదా' అనే పాత్రలో నటిస్తున్నారు. విడుదలైన గ్లింప్స్‌లో ఆమె క్యారెక్టర్ ను పరిచయం చేసిన విధానం గుండెను మెలిపెట్టేలా ఉంది. ట్రైన్ కింద తలపెట్టి చనిపోదాం అనుకున్నా, ఆ ధైర్యం సరిపోలేదని, ఆకలితో ప్రాణాలు పోతుంటే ఆఖరికి తన చేతులు అడుక్కోవడానికి ముందుకొచ్చాయని జుబేదా పాత్ర చెప్పే డైలాగ్స్ చాలా బరువైన ఎమోషన్‌ను క్యారీ చేస్తున్నాయి. దీని తర్వాత విజయ్ సేతుపతి ఎంట్రీ ఇవ్వడం చూస్తుంటే తల్లి కోసం ఏమైనా చేస్తాడా అనే క్యూరియాసిటి క్రియేట్ అయ్యింది. 'అమ్మ ఉన్నది అన్నం పెట్టడానికి, అడుక్కోవడానికి కాదు' అని పూరి వాయిస్ ఓవర్ హైలెట్ అయ్యింది. అంటే ఆకలి కోసం బిచ్చగత్తెగా మారిన ఒక తల్లి, ఆ తల్లి పడే బాధను చూడలేక రగిలిపోయే కొడుకు.. ఈ ఇద్దరి మధ్య పూరీ జగన్నాథ్ ఎలాంటి కథను రాశాడో అని ఆలోచిస్తే చాలా ఆసక్తికరంగా అనిపిస్తుంది. కచ్చితంగా ఈసారి పూరీ తన మార్క్ మాస్ ఎలిమెంట్స్‌కు ఒక గట్టి సెంటిమెంట్‌ను జోడించబోతున్నట్లు కనిపిస్తోంది. చివరగా ఇస్మార్ట్ శంకర్ లాంటి ఊర మాస్ సినిమాతో హిట్ కొట్టిన పూరీ, ఆ తర్వాత వరుస పరాజయాలతో ఇబ్బంది పడ్డాడు. కానీ ఈసారి ఆ తప్పులు జరగకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నట్లు ఈ గ్లింప్స్ క్వాలిటీ చూస్తే తెలుస్తోంది. ముఖ్యంగా పూరీ డైలాగ్స్‌లో ఉండే పదును ఈ వీడియోలోనూ తగ్గలేదు. ఛార్మి కౌర్, జేబీ మోషన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాతో పూరీ మళ్లీ తన పాత ఫామ్‌ను అందుకుంటాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. మరి ఈ ప్రయోగం ఎలాంటి రిజల్ట్ ఇస్తుందో చూడాలి. టబు కూడా ఇందులో ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు.

## టెక్నాలజీ, మన కథలు... ఇదే భారత సినిమా భవిష్యత్తు : నాగ్ అశ్విన్




భారీ బడ్జెట్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'తో జాతీయ స్థాయిలో మరోసారి సత్తా చాటిన దర్శకుడు నాగ్ అశ్విన్, భారత సినిమా భవిష్యత్తుపై తన ఆలోచనలను పంచుకున్నారు. మన దేశానికే ప్రత్యేకమైన కథలు, పురాణాలకు ఆధునిక టెక్నాలజీని జోడించడం ద్వారా భారత సినిమా సరికొత్త శిఖరాలకు చేరుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల 'కల్కి' చిత్రానికి 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో భాగంగా ఉత్తమ ప్రజాదరణ పొందిన వినోదాత్మక చిత్రం, ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ విభాగాల్లో అవార్డులు లభించిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. "మన కథలు, మన తత్వశాస్త్రానికి టెక్నాలజీని జోడించడం ద్వారా భారతీయ సినిమాకు అపారమైన అవకాశాలు లభిస్తాయి. ఇది కచ్చితంగా నిజం" అని ఆయన స్పష్టం చేశారు. టెక్నాలజీ అందరికీ అందుబాటులోకి రావడం వల్ల మరింత మంది సృజనకారులు తమ ఆలోచనలను తెరపైకి తీసుకురాగలరని నాగ్ అశ్విన్ అన్నారు. "ఈ సాంకేతికత ఎంత సులభంగా అందుబాటులోకి వస్తే, అంత వైవిధ్యమైన, అసలైన గొంతుకలకు బలం చేకూరుతుంది. ఇది ఎక్కువ మంది తమ కథలను తమదైన రీతిలో చెప్పడానికి వీలు కల్పిస్తుంది" అని ఆయన వివరించారు. 'కల్కి 2898 ఏడీ' 2024లో విడుదలైన ఒక మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ చిత్రం. హిందూ పురాణాల స్ఫూర్తితో, 2898 నాటి కాశీ నగరంలో ఈ కథ నడుస్తుంది. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, శోభన వంటి భారీ తారాగణం ఇందులో నటించారు. శేఖర్ కమ్ముల వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన నాగ్ అశ్విన్, 2018లో నటి సావిత్రి జీవిత కథ ఆధారంగా తీసిన 'మహానటి' చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న విషయం తెలిసిందే.


## సూర్యతో సినిమాపై నోరు విప్పిన రాజమౌళి



ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ఖ్యాతిని చాటిన దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, విలక్షణ నటుడు సూర్య కాంబినేషన్‌లో సినిమా వస్తే చూడాలని అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబోపై రాజమౌళి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. సూర్యతో సినిమా చేస్తే అది కచ్చితంగా చాలా ప్రత్యేకంగా (స్పెషల్) ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఆ విషయం గురించి మాట్లాడటానికి ఇది సరైన సమయం కాదని సున్నితంగా దాటవేశారు. ఇటీవల మలయాళ నటుడు ఫహాద్ ఫాసిల్ నటించిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' అనే సినిమా ప్రీ-రిలీజ్ వేడుకకు రాజమౌళి, సూర్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు రాజమౌళి సమాధానమిచ్చారు. "మీరు ఈ ప్రశ్న అడుగుతారని ఊహించే ఇక్కడికి వచ్చాను. దానికి సమాధానం కూడా సిద్ధం చేసుకున్నాను. కానీ, మనం ఇక్కడికి వచ్చింది 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' సినిమాను ప్రమోట్ చేయడానికి. ఇప్పుడు నేను, సూర్య సినిమా గురించి మాట్లాడితే, అదే హెడ్‌లైన్ అవుతుంది. అసలు సినిమా పక్కకు వెళ్లిపోతుంది. అది సరికాదు" అని అన్నారు. అదే సమయంలో అభిమానులకు భరోసా ఇస్తూ.. "మేమిద్దరం కలిసి ఎప్పుడు సినిమా చేసినా, అది కచ్చితంగా చాలా ప్రత్యేకంగా ఉంటుంది" అని చెప్పడంతో సూర్య అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. అంతటితో ఆగకుండా సూర్యను రాజమౌళి అభినందనలతో ముంచెత్తారు. ఇటీవల 'కరుప్పు', 'విశ్వనాథ్ అండ్ సన్స్' వంటి చిత్రాలతో వరుస విజయాలు సాధించడం 'డబుల్ ధమాకా' అని ప్రశంసించారు. అలాగే, జితూ మాధవన్ దర్శకత్వంలో సూర్య నటిస్తున్న 'సీన్' సినిమా ప్రచార చిత్రాలు కూడా అద్భుతంగా ఉన్నాయని కితాబిచ్చారు. గతంలో రాజమౌళి దర్శకత్వంలో నటించే ఒక అవకాశాన్ని తాను కోల్పోయానని, ఆయనతో కలిసి పనిచేయాలని ఉందని పలు ఇంటర్వ్యూలలో సూర్య స్వయంగా చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాజమౌళి వ్యాఖ్యలతో ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా రావడం ఖాయమనే అంచనాలు మరింత బలపడ్డాయి.

## అది హనుమాన్ టెంపుల్ కాదు..
## శిరీష్ ఫిర్యాదుపై పోలీసులు!





హీరో అల్లు శిరీష్ చేసిన డీజే సౌండ్ ఫిర్యాదుపై సైబరాబాద్ పోలీసులు స్పందించారు. అర్ధరాత్రి వరకు భారీ శబ్దాలతో ఇబ్బంది కలుగుతోందంటూ శిరీష్ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు, ఆ శబ్దాలకు హనుమాన్ ఆలయానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.
ఈ విషయమై అల్లు శిరీష్‌తో మాట్లాడినట్లు పోలీసులు వెల్లడించారు. సదరు శబ్దాలు గణేశ్ నిమజ్జనం ఊరేగింపు నుంచి వచ్చాయని, హనుమాన్ ఆలయం నుంచి కాదని వివరించారు. కార్యక్రమ నిర్వాహకులతో కూడా చర్చించామని, ఇప్పటికే నిమజ్జనం పూర్తయిందని వారు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం, తన నివాసం సమీపంలోని ఒక హనుమాన్ ఆలయం వద్ద అర్ధరాత్రి వరకు డీజే సౌండ్ పెట్టి ఇబ్బంది పెడుతున్నారంటూ అల్లు శిరీష్ సోషల్ మీడియా వేదికగా అసహనం వ్యక్తం చేశారు. ఈ పోస్ట్‌పై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే పోలీసులు లోతుగా విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించారు. పోలీసుల తాజా వివరణతో ఈ వివాదానికి తెరపడినట్లయింది.



## ఫౌజీ' బ్యూటీ సౌండింగ్ లేదే!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తోన్న -ఫౌజీ- సినిమాలో ఛాన్స్ అందుకుని ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది ఇమ్మాన్వీ ఇస్మైల్. డార్లింగ్ సరసన నటించాలని ఎంతో మంది ఫేమస్ బ్యూటీలో రేసులో ఉన్నా? వాళ్లందర్నీ పక్కనబెట్టి మరీ దర్శకుడు హను రాఘవపూడి ఇమ్మాన్విని ఎంపిక చేసారు. అందుకు తగ్గట్టే అమ్మడు మంచి ట్యాలెంటెడ్. డాన్సింగ్ స్కిల్స్ తో ఇప్పటికే లక్షల్లో ఫాలోవర్లను సంపాదించుకుంది. నటన పరంగా అమ్మడు ఎలాంటి పెర్ఫార్మర్ అన్నది ఫౌజీతో ప్రూవ్ అవ్వాలి. ఈ బ్యూటీ సినిమా ప్రారంభోత్సవ వేడుకలో మెరిసిన క్షణం నుంచి టాలీవుడ్ వ్యాప్తంగా పేరు మారుమోగిపోయింది. హను రాఘవపూడి కథానాయికలను వెండితెరపై ఎంత అందంగా, వైవిధ్యంగా చూపిస్తారో -సీతారామం-తో నిరూపితమవ్వడంతో ఇమ్మాన్వీ పై కూడా అంచనాలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ఆమె పాత డ్యాన్స్ వీడియోలు, సోషల్ మీడియా రీల్స్ నెట్టింట విపరీతంగా ట్రెండ్ అయ్యాయి. టాలీవుడ్‌లోకి మరో స్టార్ హీరోయిన్ ఎంట్రీ ఇచ్చేసిందంటూ ట్రేడ్ వర్గాలు కూడా భావించాయి. అయితే ఆరంభంలో కనిపించిన ఆ హడావుడి ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు. -ఫౌజీ- అనౌన్స్‌మెంట్ తర్వాత ఇమ్మాన్వీ నుంచి ఎలాంటి పెద్ద చప్పుడు లేదు. కొత్తగా ఆమె వేరే ఏ తెలుగు ప్రాజెక్ట్‌కూ సైన్ చేసినట్లు ప్రచారం జరగకపోవడం.. అలాగే టాలీవుడ్ ఈవెంట్లలో గానీ, సర్కిల్స్‌లో గానీ అమ్మడి పేరు ఎక్కడా పెద్దగా వినిపించ కపోవడంతో ఫౌజీ బ్యూటీ లైనప్ స్తబ్దుగా మారిందనే చర్చ మొదలైంది..సాధారణంగా ప్రభాస్ లాంటి గ్లోబల్ స్టార్ సరసన అవకాశం వస్తే ఇతర నిర్మాతలు, దర్శకులు ఆ కథానాయికతో సినిమాలు చేసేందుకు క్యూ కడుతుంటారు. ఆ క్రేజ్‌ను వాడుకుని వరుసగా ప్రాజెక్ట్‌లు దక్కించుకోవడం ఇండస్ట్రీలో సహజంగా జరిగే ప్రక్రియ. కానీ ఇమ్మాన్వీ మాత్రం అందుకు భిన్నంగా సైలెంట్‌గా మొదటి సినిమాపైనే పూర్తి దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది